Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 222 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 సెప్టెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

### 2026 నాటికి డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు

చెన్నై : రాజధాని నగరం చెన్నైలో డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల సేవలు 2026 నాటికి అందుబాటులోకి రానున్నాయి. నగరంలో వాహనాల రద్దీని నియంత్రించి, ప్రజలకు మెరుగైన రవాణా సేవలందించేలా ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నైలను కలుపుతూ తొలివిడతలో మెట్రోరైళ్లు నడుపుతున్నారు. విమానాశ్రయం-వింకో నగర్, సెంట్రల్-సెయింట్ థామస్ మౌంట్ మార్గాల్లో సుమారు 55 కి.మీ దూరానికి నడుపుతున్న మెట్రోరైళ్లలో ప్రయాణికుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ప్రజల్లో మెట్రోరైళ్లకు మంచి గుర్తింపు రావడంతో తాజాగా 118.9 కి.మీ వరకు మూడు మార్గాల్లో రెండో విడత పనులను సీఎంఆర్‌ఎల్ సంస్థ ప్రారంభించింది. మాధవరం-షోలింగనల్లూర్, మాధ వరం-సిరుసేరి, సిప్కాట్, పూందమల్లి- లైట్‌హౌస్ వరకు మెట్రోరైలు పనులు జరుగుతున్నాయి. ఈ కొత్త మార్గంలో డ్రైవర్లు లేకుండా మెట్రోరైళ్లు నడిపేందుకు సీఎంఆర్‌ఎల్ నిర్ణయించింది.

## 'కారు'కు 90 సీట్లు సాధ్యమేనా!?

## కాంగ్రెస్ - బిజెపిలను కేసీఆర్ కట్టడి చేయగలరా!?

### మూడో సారి విజయంపై దృష్టి పెట్టిన 'కారు సారు'



హైదరాబాద్ : తెలంగాణ సీఎం కేసీఆర్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అభ్యర్థులందరినీ ప్రకటించేశారు. రాష్ట్రంలో డిసెంబర్‌లో ఎన్నికలు ఉంటాయని కేసీఆరే స్వయంగా ప్రకటించారు. ఆ లోపు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఇప్పటి వరకు వస్తున్న సర్వే ప్రకారమైతే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కే అనుకూల పవనాలు వీస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల సమయానికి బీజేపీ కాంగ్రెస్ లు పుంజుకుంటే చెప్పలేమని కొందరు అంటున్నారు. ఈ తరుణంలో కేసీఆర్ అనుకున్న 90 సీట్లు వస్తాయా? ఆ దమ్ము కేసీఆర్ లో ఉందా? అనే చర్చ సాగుతోంది. 2014 2018 వరుసగా సీఎం పీటంపై కూర్చున్న కేసీఆర్ మొదటి ఐదేళ్లు తిరుగులేని పాలన అందించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు శరవేంగా చేయడంతో ప్రజలు కొత్త ప్రభుత్వ పాలనను ఆదరించారు. ప్రతిపక్షాలు సైతం ఐదేళ్లు వేచి చూడాలి అన్న ధోరణితో ఉండడంతో కేసీఆర్ పలు ప్రాజెక్టులకు ఓకే చెప్పారు. వీటిలో రైతుబంధు ఆసరా పింఛన్ పథకాలు ప్రజలను ఆకర్షించాయి. దీంతో రెండోసారి అధికారంలోకి రావడానికి కేసీఆర్ కు పెద్దగా కష్టం కాలేదు. ఆ సమయంలో ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చినా కేసీఆర్ ను ఢీకొట్టలేకపోయాయి. 2018 ఎన్నికల్లో కొన్ని సీట్లు కాంగ్రెస్ గెలుచుకున్నా వారందరికీ గులాబీ కండువా కప్పడంతో ఆ పార్టీ పూర్తిగా బలహీనంగా మారిపో యింది. దీంతో కేసీఆర్ కు ఎదురు లేకుండా పోయింది. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని పథకాల విషయంలో నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం దళితులకు మూడెకరాల భూమి దళితబంధు లాంటి పథకాలను ఆడంబరంగా ప్రవేశపెట్టినా వీటి అమలులో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటికి తోడు ధరణి పోర్టల్ సమస్య బీఆర్‌ఎస్ కు మైనస్ గా మారుతోంది. ఇదే సమయంలో అనూహ్యంగా కాంగ్రెస్ పుంజుకోవడం ప్రారంభించింది. బిజెపికి కూడా దుబ్బాక హుజూరాబాద్ ఉప ఎన్నికలు గెలుచుకున్న తరువాత బీఆర్‌ఎస్ కు ప్రత్యామ్నాయం తామే అని ప్రచారం చేసుకుంటున్నారు. అటు కాంగ్రెస్ సైతం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చాపకింద నీరులా డెవలప్ అవుతోంది. అయితే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు టీఆర్‌ఎస్ ను బీఆర్‌ఎస్ గా మార్చారు. తెలంగాణలో కేంద్రంలో అధికారంలోకి రావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్యలతో పాటు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మంత్రులు భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిపై కేసీఆర్ కు నివేదికలు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అయితే ఈసారి టిక్కెట్ల విషయంలో కేసీఆర్ కొందరి గురించి ఆలోచిస్తారని అంటున్నారు. సిట్టింగులకే సీట్లు వస్తాయని కేసీఆర్ చెప్పడంతో అలాంటి వారిలో గుబులు ఏర్పడింది. కొన్ని సర్వేలు బీఆర్‌ఎస్ కు అనుకూల పవనాలు వీస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయికి వెళ్లేసరికి మాత్రం ప్రత్యామ్నాయ పార్టీ గురించి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ కు పట్టం కడుతారని అనుకోవడం లేదని కొందరు అంటున్నారు. బీఆర్‌ఎస్ 2 ప్రభుత్వంతో లాభపడిన వారు మినహాయిస్తే చాలా వరకు ప్రజలు మూడోసారి ఓటేయ్యడంపై తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. కానీ కేసీఆర్ ఎన్నికల సమయం నాటికి ఏదోలా పార్టీ గట్టెక్కేలా చర్యలు తీసుకుంటారని కొందరు అనుకుంటున్నారు.

### వీఓఏల గౌరవ వేతనం పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ : గ్రామ సంఘాల సహాయకుల(వీఓఏ)కు తెలంగాణ ప్రభుత్వం రాఖీ పండుగ కానుక అందించింది. వీఓఏల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. రూ. 3,900 నుంచి రూ. 5 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు సాయం రూ. 3 వేలతో కలిపి నెలకు రూ. 8 వేలు అందుకోనున్నారు వీఓఏలు. ప్రభుత్వ నిర్ణయంతో 17,608 మంది వీఓఏలకు లబ్ధి చేకూరనుంది. ఈ సందర్భంగా వీఓఏలు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి హరీశ్‌రావుకు రాఖీలు కట్టి మహిళలు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

## గోండుల కోటలో అక్కాచెల్లెళ్ల ఢీ.. గెలుపు ఎవరిది?



అసిఫాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ కూడా తమ జాబితాలను ప్రకటించనున్నాయి. కాగా ఈసారి కొన్ని నియోజకవర్గాల్లో రక్త సంబంధీకులు అంటే అన్నాచెల్లెళ్లు, అన్నాతమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు ఇలా పోటీ తప్పకపోవచ్చని తెలుస్తోంది. ముఖ్యంగా గోండుల కోట.. అసిఫాబాద్ నియోజకవర్గంలో అక్కాచెల్లెళ్ల పోరు ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో అసిఫాబాద్ నియోజకవర్గం సర్వత్రా ఆసక్తిని రేపుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న అసిఫాబాద్ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. ప్రస్తుతం ఈ నియోజకవర్గం కుమురం భీమ్ జిల్లాలో ఉంది. ప్రస్తుతం అసిఫాబాద్ ఎమ్మెల్యేగా ఆత్రం సక్కు ఉన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన సక్కు ఆ తర్వాత బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా ఇటీవల కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఆత్రం సక్కుకు సీటు లభించలేదు. మాజీ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి కేసీఆర్ సీటు కేటాయించారు. ఆత్రం సక్కును ఆదిలాబాద్ ఎంపీ స్థానం నుంచి బరిలోకి దింపడానికే కేసీఆర్ ఆయనకు సీటు కేటాయించలేదని వార్తలు వచ్చాయి. అయితే కేసీఆర్ నిర్ణయంపై ఆత్రం సక్కు సంతృప్తిగా లేరని అంటున్నారు. కాగా బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకున్న కోవా లక్ష్మి 2014లో తొలిసారి ఆ పార్టీ తరఫున ఆసిఫాబాద్ లో గెలుపొందారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు చేతిలో కోవా లక్ష్మి ఓడిపోయారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో జెడ్పీటీసీగా గెలుపొంది ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. మరోవైపు గత ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లోనూ అసిఫాబాద్ లో గెలుపొందడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో కోవా లక్ష్మి మీద ఆమె సొంత చెల్లెలినే బరిలో దించే ఆలోచన చేస్తోంది. ఆసిఫాబాద్ సర్పంచ్ గా పనిచేసిన మర్సకోల సరస్వతిని అభ్యర్థిగా నిలపాలని భావిస్తోంది. ఇప్పటికే ఆమె కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా సరస్వతి అయితేనే కోవా లక్ష్మికి సరైన ప్రత్యర్థి అవుతారని భావిస్తున్నారు. కోవా లక్ష్మి ఒకసారి ఎమ్మెల్యేగా, ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉండటంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని టాక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అ

క్క మీద ఉన్న వ్యతిరేకతే తనకు అనుకూలంగా మారుతుందని సరస్వతి భావిస్తున్నారని తెలుస్తోంది. దీంతో తన గెలుపు ఖాయమనే ధీమాలో ఉన్నారు. కాగా సరస్వతి గతంలో ఒకసారి తెలుగు దేశం అభ్యర్థిగా పోటీ చేసి అసిఫాబాద్ లో ఓటమి చెందారు. మరోవైపు ప్రజల్లో పలుకుబడి లేని చెల్లెలు తనకు పోటీయే కాదంటున్నారు కోవా లక్ష్మి. తాను సులువుగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసిఫాబాద్‌లో అక్కాచెల్లెలి పోరాటం ఆసక్తి రేపుతోంది.

## హైదరాబాద్ వేదికగా రసవత్తర రాజకీయం




హైదరాబాద్: హైదరాబాద్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ రసవత్తర రాజకీయం చేయబోతోంది. తెలంగాణలో రాబోయే ఎన్నికలే లక్ష్యంగా CWC తొలిసారి హైదరాబాద్‌లో భేటీ కాబోతోంది. సెప్టెంబర్ 16వ తేదీన హైదరాబాద్‌లో CWC సమావేశం నిర్వహించాలని ఏఐసీసీ ఆలోచన చేస్తోంది. కాగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేతో పాటు CWC సభ్యులంతా హైదరాబాద్‌లో సమావేశాలకు తరలి రానున్నారు. సెప్టెంబర్ 18వ తేదీన "ఎన్నికల శంఖారావం" పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. తెలంగాణ ఎన్నికలు టార్గెట్‌గా కార్యక్రమాలను రూపొందించనున్నారు. కాగా అనుకోకుండా వచ్చిన పార్లమెంట్ సమావేశాలతో CWC సమావేశాల తేదీలు మారే అవకాశాలు ఉన్నాయి.

కానీ పక్కాగా హైదరాబాద్‌లోనే ఈ సమావేశాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇదే జరిగితే హస్తం పార్టీ మరింత పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ గట్టిపోటీనిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ప్రత్యర్థిగా మారి రాష్ట్రంలో ఇటు బీఆర్‌ఎస్‌కు.. అటు కేంద్రంలో బీజేపీకి చెక్ పెట్టేలా కాంగ్రెస్ అధిష్ఠానం పావులు కదుపుతోంది. కేంద్రంలో హవాను చూపించాలనుకుంటున్న సీఎం కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీలను ఢీకొట్టేలా కాంగ్రెస్ అధిష్ఠానం పథకం రచిస్తోంది.



### తెలంగాణకు మరోసారి

హైదరాబాద్: మరోసారి తెలంగాణలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారు.. ఈమేరకు తెలంగాణ బీజేపీ కార్యచరణ రూపొదింస్తుంది. ఈ పర్యటనలో అమిత్ షా పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.

అలాగే వరంగల్ వేదికగా కేంద్రం ఆధ్వర్యంలో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. గతేడాది నుంచి సెప్టెంబర్ 17వ తేదీను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్రం అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి వరంగల్‌లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర భద్రత దళాలతో వరంగల్‌లో కవాతు నిర్వహణకు ప్లాన్ రూపొందిస్తున్నారు. ఈ కవాతులో అమిత్ షా గౌర వందనం స్వీకరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణపై బీజేపీ హైకమాండ్ ఫోకస్ పెంచిన నేపథ్యంలో అమిత్ షా పర్యటన ఆసక్తికరంగా మారనుంది.

## సంపాదకీయం

### కేజ్రీవాల్ కు ఓవర్ యాక్షన్ అవసరమా ?

కష్టాల్లో ఉన్నవాళ్ళు ఓవర్ యాక్షన్ చేయకూడదు. ఇంతచిన్న విషయాన్ని కూడా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరచిపోయారు. ముందు ఓవర్ యాక్షన్ చేసేసి ఇపుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తో భేటీకి నానా అవస్తలు పడుతున్నారు. ఇంతకీ జరిగింది ఏమిటంటే రాహుల్ తో టీ భేటీకి కేజ్రీవాల్ ఆహ్వానం పంపారు. అయితే రాహుల్ నుండి ఇంకా ఎలాంటి రెస్పాన్స్ కనబడలేదు. దాంతో కాంగ్రెస్ వైఖరిపై కేజ్రీవాల్ లో అసహనం పెరిగిపోతోంది. దీనికి ఒక ఫ్లాష్ బ్యాక్ ఉంది. మొన్ననే బీహార్ రాజధాని పాట్నాలో ప్రతిపక్షాల సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో అన్నీపార్టీల అధినేతలు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని సమిష్టి నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే తర్వాత జరిగిన మీడియా సమావేశాన్ని కేజ్రీవాల్ బహిష్కరించారు. ఎందుకంటే ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను హరించేట్లుగా నరేంద్ర మోడీ పార్లమెంటులో బిల్లు తేబోతున్నారు. దానికి వ్యతిరేకంగా కేజ్రీవాల్ పోరాడుతున్నారు. తన పోరాటంలో కాంగ్రెస్ మద్దతు పలకలేదని తన వైఖరిని స్పష్టంచేయలేదన్నది కేజ్రీవాల్ కోపం. నిజానికి ఢిల్లీ అంశం కూడా చాలా కీలకమైనదనే చెప్పాలి. ఇపుడు అవసరం కేజ్రీవాల్ కు ఎక్కువగా ఉంది. ఎలాగంటే రాబోయే పార్లమెంటు సమావేశాల్లోనే మోడీ బిల్లు ప్రవేశపెట్టి నెగ్గించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్ సభలో ఓకేకానీ రాజ్యసభలో బిల్లు గెలవటం అంత సులభంకాదు. ఒకవేళ బిల్లు ఇక్కడ కూడా పాసైతే కేజ్రీవాల్ న్యాయపోరాటం చేయాల్సిందే. కాబట్టి సహచర పార్టీలతో మంచిగా ఉండటం ఇపుడు కేజ్రీవాల్ కు తక్షణావసరం. అయితే కొంచెం కూడా ఓపికలేనట్లుగా కేజ్రీవాల్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశాన్ని బహిష్కరించారు. కాంగ్రెస్ తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొనేదిలేదని తెగేసిచెప్పి ఢిల్లీకి చేరుకున్నారు. దాంతో రాహుల్ బాగా హర్టయ్యారు. కాంగ్రెస్ మద్దతు కోరుతు భేటీకి ముందో తర్వాతో డైరెక్టుగా రాహుల్ లేదా మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యుండచ్చు. తన తరపున నితీష్ లేదా మరొక నేతను రాయబారం చేయమని అడిగుండివచ్చు. అలాంటిది ఏమీ చేయకుండానే మీడియా సమావేశాన్ని బహిష్కరించటం తప్పు. ఆ తప్పును దిద్దుకోవటానికి ఇపుడు రాహుల్ ను టీ భేటీకి పిలిచారు. అప్పుడు ఓవర్ యాక్షన్ చేయటం ఎందుకు ఇపుడు అవస్తలు పడటం ఎందుకు ?

# ఎక్కడున్నా.. నీ బియ్యం నీకే..!



మిర్యాలగూడ : ఉపాధి, బతుకుదెరువు కోసం ప్రజలు దేశంలోని పలు రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. అలా వలస వెళ్లిన వారు రేషన్ బియ్యం తమ సొంత ప్రాంతంలోనే తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వారు బియ్యం తీసుకోలేక పోయేవారు. వారి కోటా బియ్యం సంబంధిత రేషన్ డీలర్ పక్క దారి పట్టించే అవకాశం సైతం ఉంది. అయితే వీటిని నివారించేందుకు కేంద్రం 'వన్ నేషన్..వన్ రేషన్' పథకాన్ని తీసుకొచ్చింది. మూడేళ్ల క్రితమే ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఉమ్మడి జిల్లాలో జనవరిలో ప్రయోగాత్మకంగా.. ఫిబ్రవరి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. రాష్ట్ర పరిధిలో ఏ ప్రాంతంలో ఉన్న వారైనా వారు ఉన్న చోటే బియ్యం తీసుకునే సదుపాయం ఇప్పటికే అమల్లో ఉంది.

వలస కూలీలకు మేలు..

పలు పనుల నిమిత్తం ఉమ్మడి జిల్లా నుంచి ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలస వెళ్తుండగా..బీహార్, ఉత్తరప్రదేశ్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలకు వలస వస్తుంటారు. భవన నిర్మాణం, మగ్గం పని, పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. అయితే వీరికి రేషన్ కార్డులు ఉన్నప్పటికీ బియ్యం తీసుకోలేక.. బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వన్ నేషన్..వన్ రేషన్‌తో వలస వాదుల కష్టాలు తీరనున్నాయి. ఇతర రాష్ట్రాల వారు బియ్యం తీసుకోవాలంటే జాతీయ ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. రేషన్ దుకాణంలో ఈ- పోస్ యంత్రంలో వలస వాదుల ఆధార్ సంఖ్య నమోదు చేయగానే ఎన్‌ఎఫ్‌సీ కార్డు పూర్తి వివరాలు వస్తాయి. వివరాల ఆధారంగా డీలరు బియ్యం అందిస్తారు.

ప్రస్తుతం యూనిట్‌కు 5 కిలోల పంపిణీ..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 10,08,045 రేషన్ కార్డులు ఉండగా.. ఫిబ్రవరి నెలకు సంబంధించి 16,344.57 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. కార్డుల్లోని ఒక్కో యూనిట్‌కు కేంద్రం ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుంది. వన్ నేషన్..వన్ రేషన్ పథకం కింద ప్రయోగాత్మకంగా నల్గొండ జిల్లాలో మొత్తం 20 మంది ఇతర రాష్ట్రాల కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. ప్రస్తుతం కేంద్రం ఈ ఏడాది డిసెంబరు వరకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుంది.

వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి- వి.వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

వలస కార్మికుల సంక్షేమ కోసం ప్రవేశ పెట్టిన వన్ నేషన్.. వన్ రేషన్..పథకంలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఎఫ్‌సీ కార్డు కలిగి ఉన్న ప్రజలు జిల్లాలో ఏ రేషన్ దుకాణంలోనైనా బియ్యం తీసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. గత నెలలో జిల్లాలో 20 మంది ఇతర రాష్ట్రాల కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశాం. ఈ నెలలో సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# పొట్టకూటికొచ్చి.. ప్రాణాలు విడుస్తూ..!



మిర్యాలగూడ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి పరిధిలో.. ఈ నెల 6న జాతీయ రహదారి విభాగిని మధ్య నీళ్లు పోసే ట్యాంకర్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య కళ్లెదుటే భువనగిరి మండలం కేసారానికి చెందిన కాశపాక ఎల్లేష్ నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. వారు రోజువారీ కూలీలు.. రెక్కాడితే కానీ డొక్కాడని జీవన పరిస్థితులు.. పొట్టకూటి కోసం వచ్చిన వారిని మృత్యువు రూపంలో దూసుకొస్తున్న వాహనాలు కబళిస్తున్నాయి. మొక్కలను బతికించేందుకు వచ్చి రోడ్డుపై బలవుతున్నారు. ప్రమాదాలు అనేకం జరుగుతున్నా.. పరిహారంతో సరిపెడుతున్నారు తప్ప నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనడం లేదు. ఇప్పటికే పది మంది వరకు హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి 163పై ప్రమాదాల బారిన పడ్డారు. కొందరు రహదారి సెంట్రల్ మీడియంలోని మొక్కలకు నీళ్లు పోస్తూ మృతిచెందారు.ఇదీ పరిస్థితి.. జాతీయ రహదారికి ఇరువైపులా, విభాగిని మధ్య మొక్కలు, చెట్ల సంరక్షణ చర్యల్లో భాగంగా కూలీలు నీళ్లు పడుతుంటారు. వాటిలో అప్పుడప్పుడు కలుపు తీస్తుంటారు. పనులు జరుగుతున్న సమయంలో కూలీలు రేడియం జాకెట్లు ధరించి ఉండాలి. రోడ్డుపై నిల్చున్న సమయంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి. స్టాపర్ కోన్‌లు ఏర్పాటు చేసి వాహనదారులు గుర్తించే చర్యలు చేపట్టాలి. ఇక్కడ పని చేస్తున్న కూలీలకు రక్షణ చర్యలు లేకపోవడంతో వాహనాలే వేగంగా దూసుకొచ్చి ఢీకొడుతున్నాయి. డ్రైవర్లు అప్రమత్తమై తప్పించాలనుకున్నా.. వాహన వేగాన్ని నియంత్రించలేక పోతున్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పనులు చేయించాల్సిన సంబంధిత గుత్తేదారులు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు కనిపించడం లేదు. మొక్కలు నీళ్లు పట్టేందుకు బిందు సేద్యం పద్ధతి ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా వినియోగించడం లేదు. జాతీయ రహదారి మరమ్మతులు, ఇతర పనులు చేపట్టేప్పుడు ఆ రోడ్డు గుండా వచ్చే వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. పక్కకు డైవర్షన్ ఇచ్చేలా 200 మీటర్ల దూరంలో ఎరుపు జెండా పట్టుకొని వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా చూసేందుకు వ్యక్తిని నియమించాలి. జాతీయ రహదారిపైన వాహనం నిలిపి పనులు చేస్తున్న క్రమంలో ఆ దిశగా వచ్చే వాహనాదారులకు కనిపించేలా దూరంలోనే హెచ్చరిక, సూచన బోర్డు ఏర్పాట్లు ఉండాలి.

ఇవీ ఘటనలు గతేడాది మార్చి 6న ఆలేరు బైపాస్ రోడ్డులో జాతీయ రహదారి విభాగిని మధ్యలో కూలీలు మట్టి పోస్తుండగా.. భువనగిరి పురపాలిక పరిధిలోని రాయగిరికి చెందిన తోడికోడళ్లు అంకర్ల వరలక్ష్మి, అంకర్ల కవిత, భార్యభర్తలు ఊరేళ్ల శ్యామ్, ఊరేళ్ల లావణ్య వెనుక నుంచి బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే నలుగురు మృతిచెందారు. ఉదయం నుంచి పనిచేసి మరో గంటయితే ఇంటికి బయలుదేరే సమయానికి విధి పగబట్టింది. బస్సు రూపంలో వీరిని కబళించింది. ఆరునెలల క్రితం భువనగిరి బైపాస్ రోడ్డులో పనులు చేస్తుండగా ఓ కూలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. భువనగిరి మండలం అనంతారం క్రాస్ రోడ్డు వద్ద విభాగిని మధ్యలో నీళ్లు పోస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు.

# అభ్యంతరాలతో ఆగిన ఉపకేంద్రం నిర్మాణం



ఏటూరునాగారం : ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లిలో చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రం పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అనుమతులు లేవని అభ్యంతరం తెలపడంతో పునాధి పనులను అర్ధంతరంగా ఆపేశారు. బోరు కోసం తీసిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెప్పినా ససేమిరా అన్నారు. వాహనం సీజ్ చేస్తామంటూ బోరు సెట్టు యజమానిని హెచ్చరించారు. దీంతో కేసింగ్ పని పూర్తి చేయకుండానే నిలిపేసి వెనుదిరిగాడు. పిల్లర్ల ఏర్పాటు కోసం తవ్విన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని చిన్నబోయినపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్‌తో పూర్తి అటవీ ప్రాంతంలోనే ఉన్న గ్రామాలకు త్రీ ఫేస్ విద్యుత్తు సరఫరా నిరంతరాయంగా అందించే అవకాశం ఉంటుంది. సుమారు 25 కిలో మీటర్ల పరిధిలో 15 గ్రామాల వరకు ఉన్నాయి. నిర్మాణం పూర్తైతే ఆయా గ్రామాలకు దీర్ఘకాలిక విద్యుత్తు సమస్య తీరేది.

కొలిక్కిరాని భూ వివాదం

సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన భూమి వివాదం కొలిక్కి రావడం లేదు. అటవీ, రెవెన్యూ శాఖ మధ్య సంవత్సరాల తరబడి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. చిన్నబోయినపల్లి రెవెన్యూ శివారు 98 సర్వే నంబర్‌లో మొత్తం 828.18 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత వరకు అడవి విస్తరించి ఉండగా సుమారు 250 ఎకరాల మేర అడవులు లేకుండా ఉండేవి. 35 సంవత్సరాలుగా ఈ భూముల్లో వంద మందికి పైగా రైతులు పోడు భూములని చెప్పి ఆరుతడి పంటలు సాగు చేసేవారు. దశాబ్దకాలంగా రైతులను సాగు చేయనీయకుండా ఆ భూమి అటవీశాఖదేనంటూ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో ధర్నాలు, నిరాహార దీక్షలు పెద్దఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా విద్యుత్తు ఉపకేంద్రం పనులను కూడా అడ్డుకున్నారు. పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి: తుమ్మ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ, చిన్నబోయినపల్లిసుదీర్ఘకాలంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతు ందన్న తరుణంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదు. విద్యుత్తు సబ్ స్టేషన్ పనులకు అడ్డు చెప్పొద్దు. ఈ విషయమై పునరాలోచించాలి.కలెక్టర్ మేరకు చర్యలు తీసుకోవాలి.

# రాజమార్గం.. సత్వర పరిష్కారం

మెదక్ : వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక. సాధారణంగా కోర్టుల్లో అపరిష్కృత కేసుల పరిష్కారానికి దీన్ని నిర్వహిస్తున్నారు. ఇరువర్గాలకు అవగాహన కల్పించి వారి మధ్య రాజీ కుదిర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశం. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సాధారణంగా కోర్టుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ సంబంధించినవి వాటికి ప్రాధాన్యం ఇస్తారు. ఇక్కడ తీర్పు ఇచ్చిన కేసులకు మళ్లీ అప్పీలు చేసుకునే అవకాశం లేదు.

ఇరువర్గాల విజయం

లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులకు మోక్షం లభిస్తే ఇరువర్గాల విజయం సాధించినట్లే. ఇరు వర్గాలకు చెందిన వారు ఓ అవగాహనకు వస్తారు. కాబట్టే ఒకరిది గెలుపు, మరొకరిది ఓటమి అన్నట్లు ఉండదు. మానసికంగా కుంగిపోయే అవకాశం లేదు. అందుకే చాలా కాలం నుంచి న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని న్యాయమూర్తులు సూచిస్తున్నారు.

39,714 కేసుల పరిష్కారం



2022లో జిల్లా వ్యాప్తంగా నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కోర్టుల పరిధిలో 39,714 కేసులు పరిష్కరించారు. జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా న్యాయస్థానం ఏర్పాటైన తర్వాత 3 సార్లు కార్యక్రమం జరిగింది. జిల్లా కోర్టు ఏర్పాటు తర్వాత నిర్వహించిన తొలి లోక్ అదాలత్‌లో ఏకంగా ఎప్పుడూ లేనట్లుగా 13,829 కేసులకు మోక్షం దక్కింది. ఆ తర్వాత జరిగిన రెండింటిలో వరుసగా 13,987, 10,224 కేసులు పరిష్కరించారు. జిల్లా పరిధిలోని ఇరువర్గాల కక్షిదారులు ఆయా న్యాయస్థానాలకు వెళ్లి రాజీ కుదుర్చుకుంటున్నారు. కుటుంబ, ఆస్తి వివాదాలు, మోటారు రవాణా, బ్యాంకు రికవరీలు, ఎక్సైజ్, ముందస్తు విచారణ కేసులు, ప్రజా సంబంధమైన వాటిని న్యాయసేవాధికార సంస్థల ద్వారా పరిష్కరిస్తున్నారు.

అవగాహన కల్పించాంలక్ష్మీశారద, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నేడు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాం. ఇప్పటికే న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించాం. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# నిర్లక్ష్యం.. అభివృద్ధికి ఆటంకం

మెదక్ : మెదక్ మండలం రాయిన్‌పల్లిలో మత్స్యకారులకు 2017లో రూ.5 లక్షలతో సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. స్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. ఆ తర్వాత రూ.3 లక్షలు కేటాయించగా.. పనులు కొనసాగలేదు. మండలంలో ఏడు గ్రామాల్లో ఏసీడీపీ నిధులతో సామాజిక భవనాలకు రూ.46 లక్షలు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం ఒక్క చోటే పూర్తయింది. ఐదు చోట్ల ప్రారంభం కాకపోవడం గమనార్హం.హవేలిఘనపూర్ మండలం బ్యాతోల్‌లో రూ.5 లక్షలతో ఎస్సీ సామాజిక భవనం నిర్మించారు. స్లాబ్ వేయగా, మిగిలిన పనుల పూర్తికి ఇటీవల అదనంగా రూ.5 లక్షలు కేటాయించారు. ఇంకా పూర్తికాలేదు.పట్టణాలు, పల్లెలో అభివృద్ధి పనులకు శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (ఏసీడీపీ) కింద నిధులు కేటాయించగా పనులు చేపడుతున్నారు. కానీ అరకొర కేటాయింపులతో ఏళ్లుగా అసంపూర్తిగా ఉంటున్నాయి. ఏడాదిలోపు పూర్తిచేయాలనే నిబంధన ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. కొన్నింటికి నిధులు లేకపోవడం, మరికొన్నింటికి పైసలున్నా సరిపోవనే కారణంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కరోనా సమయంలో..జిల్లాలో మెదక్, నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు ఇతర ఎనిమిది మండలాలు ఆయా నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. రెండో సారి తెరాస అధికారంలోకి వచ్చాక 2020-21 ఆర్థికసంవత్సరంలో నిధులు కేటాయించగా, కరోనా కారణంగా వాటిని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన నిధులతో ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం.

పెంచినా అంతే..2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఏసీడీపీ నిధుల కోటా పెంచింది. గతంలో రూ.2.50 కోట్లు ఉండగా, రూ.3



కోట్లకు పెంచింది. ఇప్పటి వరకు కేవలం మెదక్ నియోజకవర్గం నుంచి 30 పనులకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రణాళిక శాఖకు అందాయి. వాటిలో ఇప్పటివరకు రెండు పనులు పూర్తయ్యాయి. నర్సాపూర్ నుంచి ఇంకా ప్రతిపాదించలేదు. నెలన్నర రోజుల్లో ఆర్థికసంవత్సరం ముగియనుంది. ఆలోగా కనీసం పనులైనా ప్రారంభించాల్సి ఉంది.

నామినేషన్ పద్ధతికే మొగ్గుఏసీడీపీ నిధులు రూ.5 లక్షలు దాటితే టెండరు వేయాలి. రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించే అవకాశం ఉంది. దీన్ని కొందరు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. బినామీ పేర్లతో పనులు చేపట్టడమో, అనుచరులకు అప్పగించడమో చేస్తున్నారు. దీనికి తోడు పంచాయతీరాజ్ శాఖ అంచనాలకు తగ్గట్టుగా నిధులు రాకపోవడం మరో కారణం. ఎంపీ కోటా కింద మంజూరైనవి సైతం పూర్తి కాలేదు.

సకాలంలో పూర్తి చేస్తాం

సత్యనారాయణరెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మెదక్ నియోజకవర్గం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఎక్కువగా సామాజిక భవనాలకు కేటాయించాలని సూచించారు. ఇది వరకు సీడీపీ నిధులతో చేపడుతున్న పనుల్లో అసంపూర్తిగా ఉన్న వాటికి నిధులు ప్రతిపాదిస్తే సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# ఎన్నాళ్లీ బాధలు.. నిత్యం ప్రమాదాలు

ఆలేరు : ఇరుకైన కాజ్‌వేలు.. నిత్యం భారీ వాహనాల రాకపోకలు.. ఆదమరిస్తే ప్రమాదాలు.. ఎందరో క్షతగాత్రులు.. నైజాం కాలంలో నిర్మితమైన ఆలేరు మండలం కొలనుపాకలోని లో-లెవల్ వంతెనల దుస్థితి ఇదీ. ఎట్టకేలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ లో లెవల్ కాజ్‌వేకు కనీస మరమ్మతులు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆలేరు-కొలనుపాక రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్-వరంగల్- భూపాల్‌పట్నం జాతీయ రహదారి 163, రాజీవ్ రహదారిని అనుసంధానంగా ఆలేరు-సిద్దిపేట జిల్లా దుద్దెడ రహదారి ఉంది. ఈ మార్గంలోనే కొలనుపాక గ్రామం ఉంది. ఈ గ్రామంలోని రెండు వాగులు ఈ రహదారి మీదుగానే వెళ్తుంటాయి. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలోని సుమారు 200 మీటర్ల పొడవున, జైన్ మందిరం సమీపంలో 100 మీటర్ల పొడవున మరో లో లెవల్ కాజ్‌వేను దశాబ్దాల క్రితం నిర్మించారు. ఇప్పుడవి పూర్తిగా శిథిలమయ్యాయి. రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. సైడ్ వాల్స్ ఏళ్ల కిందటే కూలిపోయాయి. వాహనాలు అదుపుతప్పి వాగులో పడుతున్నాయి. లో-లెవల్‌లో కాజ్‌వే ఉండటంతో వర్షాకాలంలో వాగు ఉద్ధృతికి కొన్ని రోజుల పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మూడేళ్లుగా వానలు జోరుగా కురవడంతో వానాకాలం సీజన్‌లో నెలల



తరబడి వాగు ప్రవహిస్తూనే ఉంటుంది. గత నెలలో కురిసిన వర్షాలకు వారం రోజులకు పైగా గ్రామంలో జలదిగ్బంధనంలోనే ఉంది. భారీ వర్షాలు పడిన సమయంలో వాగు ఉప్పొంగి కొలనుపాకకు ఇతర ప్రాంతాల్లో రోజుల తరబడి సంబంధాలు తెగిపోతాయి. వాగులోంచి ఇసుకను తరలించడంతో కాజ్‌వే పొడవునా లోతైన గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. రోజుల తరబడి వరద నీటి ప్రవాహం కారణంగా నాచుపేరుకుపోయి లారీలు, జీపులు, కార్లు, ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాగులో పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సైడ్‌వాల్స్ లేనికారణంగా నీటి ప్రవాహంతో రోడ్డు తెలియక వాహనాలు కొట్టుకుపోతున్నాయి. ఈ రెండు కాజ్‌వేలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలకు వాగులు పొంగిపొర్లడంతో రవాణా వ్యవస్థ స్తంభిస్తున్నందున వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోవడంతోపాటు స్థానిక ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఎమ్మెల్యే గొంగిడి సునీత చొరవతో కొన్ని నెలల కిందట ఎట్టకేలకు రూ. 4.85 కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆర్అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించడం లేదు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం:గొంగిడి సునీత, ఎమ్మెల్యే, ఆలేరు.

కొలనుపాక సబ్‌స్టేషన్ సమీపంలోని పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 4.85 కోట్లు మంజూరు చేయించాను. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. గుత్తేదారు నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. వర్షాల వల్ల పనులు ప్రారంభించడంలో కొంత జాప్యం జరిగింది. నీటి ప్రవాహ ంతో పనులు చేపట్టలేకపోయాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

# ఇళ్ల మధ్య గ్యాస్ దందా

జిన్నారం: పారిశ్రామిక ప్రాంతమైన జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. కొన్ని నెలలపాటు ఇక్కడ పనిచేసి.. ఒప్పందం ముగిసిన తర్వాత వారి ప్రాంతాలకు వెళుతుంటారు. ఇలాంటి వారు వంట కోసం చిన్న గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేస్తుంటారు. వారికి రీఫిల్లింగ్ కోసం కొన్ని దుకాణాల యజమానులు రాయితీ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఇళ్ల మధ్యనే గ్యాస్ నింపుతూ.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న తీరుపై కథనం.

కొన్ని ఘటనలు గత నెలలో ఐడీఏ బొల్లారం పట్టణంలోని పాత బస్తీలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దాసుపత్రికి వెళితే ఈ ఘటన వెలుగులోకి వస్తుందని.. స్థానిక



ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. అక్కడ సరైన వైద్యం అందక ఓ బాలుడి కాలు తీసేయాల్సి వచ్చింది. ఆ తరువాత బాధిత కుటుంబాన్ని వారి సొంత రాష్ట్రమైన బిహార్‌కు పంపించారు.

బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో రీఫిల్లింగ్ చేస్తుండగా వంట గ్యాస్ వాసన వస్తుందని స్థానికులు ఆందోళన చేశారు. ఇప్పటికీ అక్కడ దందా యథేచ్ఛగా సాగుతోంది. వారం రోజుల క్రితం ఇలాంటి కేంద్రాలపై అధికారులు దాడులు చేశారు. నాలుగు కేంద్రాల నుంచి పదుల సంఖ్యలో రాయితీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత కొందరు స్థానిక నేతలు బేరం కుదిర్చి చర్యలు తీసుకోకుండా చేశారనే ఆరోపణలున్నాయి.కఠిన చర్యలు తప్పవుగత వారం ఐడీఏ బొల్లారం పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాం. రీ ఫిల్లింగ్ నిర్వాహకులను గుర్తించి హెచ్చరించాం. మళ్లీ ఇలాంటి దందా చేయబోమని వారు చెప్పారు. అనుమతి లేకుండా ఏ వ్యాపారం చేసినా నేరమే అవుతుంది. నిరంతర నిఘాతో గ్యాస్ దందాకు అడ్డుకట్ట వేస్తాం.సుజాత, ఉప తహసీల్దార్, పౌరసరఫరాల విభాగం.

# కూడళ్లపైనే అందరి దృష్టి



పెద్దపల్లి : కూడళ్లను సుందరీకరణ చేయాలని పురపాలిక అధికారులు ప్రయత్నిస్తుండగా, నాయకుల విగ్రహాలు ఎక్కడ పెట్టాలనే అంశాలపై ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలోని వివిధ కూడళ్ల సుందరీకరణ కోసం గతంలోనే పురపాలిక అధికారులు కొన్ని కూడళ్ల పనులు చేపట్టారు. ఈసారి మరికొన్ని కూడళ్ల సుందరీకరణకు కార్యాచరణ చేపడుతున్నారు. నేతల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సంఘాలు, సంస్థలు పోటీలు పడుతుండటం చర్చనీయాంశమవుతోంది.

కొత్త సొబగులు

పెద్దపల్లిలో ప్రగతినగర్‌లోని పాత కోర్టు కూడలి, శంకర్‌గంజ్‌లోని చాకలి ఐలమ్మ కూడళ్లను సుందరీకరించేందుకు పురపాలిక అధికారులు కార్యాచరణ చేపట్టారు. రూ. 50 కోట్లతో ఈ రెండు కూడళ్లను విస్తరించి, సుందరంగా మార్చనున్నారు. రెండు ప్రాంతాల్లో కూడ కొద్ది మార్పులతో గ్లోబ్ మాదిరి వాటర్ ఫౌంటేన్, అందమైన లైటింగ్ ఏర్పాటు చేసేందుకు డిజైన్ ఆమోదించారు. కానీ గతంలో జెండా కూడలిలో కూడలి విస్తరణ చేపట్టిన అధికారులు, సుందరీకరణ పనులు మాత్రం నిర్వహించలేదు. సుభాష్ విగ్రహం కూడలిని అభివృద్ధి చేసి, విగ్రహాన్ని కూడలి మధ్యలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన సాకారం కాలేదు. దీంతో విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే ఒక వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. శాంతినగర్ కూడలిలోనూ రోడ్డు పక్కన హన్‌మాన్ విగ్రహం వద్ద మరో ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఈరెండు ఫౌంటేన్‌ల నిర్వహణ సైతం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన రెండు కూడళ్లలో పనులు ఏ మేరకు ముందుకు సాగుతాయో పాలకమండలి కార్యదక్షతపైనే ఆధారపడి ఉంది.

విగ్రహాల కోసం పోటీ

జిల్లా కేంద్రంలో రహదారులను విస్తరించి, విభాగిణిలను ఏర్పాటు చేయడంతో రాజకీయ పార్టీల నాయకులు విగ్రహాల ఏర్పాటుపై ఆలోచనలు మొదలయ్యాయి. కూడళ్లు, రహదారులపై నేతల విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఎక్కడా అమలు కావడం లేదు. అంతటా అనధికారికంగా విగ్రహాల ఏర్పాటు జరుగుతుండడం, పెద్దపల్లిలో ఇటీవల మరీఎక్కువ కావడంతో విగ్రహాల ఏర్పాటు కోసం నాయకుల మధ్య పోటీ పెరిగింది. ఇటీవల కమాన్ కూడలి నుంచి సుభాష్ విగ్రహం వరకు రహదారి విస్తరించి, రోడ్డు మధ్య విభాగిణి ఏర్పాటు చేశారు. కమాన్ కూడలి సమీపంలోని విభాగిణి ఆరంభమయ్యే ప్రాంతంలో స్పీకర్ శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటు కోసం యువజన కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ విషయం తెలియని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆచార్య జయశంకర్ విగ్రహం ఏర్పాటు కోసం మరోసారి పూజ చేయడంతో వివాదం ఏర్పడింది. ఈ రోడ్డులోని విభాగిణి ముగిసే ప్రాంతంలో విగ్రహం పేరు చెప్పకుండానే యాదవ సంఘం నాయకులు బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. గతంలో ప్రగతి నగర్ కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కొందరు నాయకులు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పాతకోర్టు నుంచి అమర్‌నగర్‌వైపు డివైడర్‌కు జ్యోతిబాఫులే, ప్రగతినగర్ వద్ద ఎన్టీఆర్, రైల్వేస్టేషర్ రోడ్డులో బస్టాండ్ వద్ద జగ్జీవన్ రాం, కూనారం రోడ్డులో ఎమ్మెల్యే ముకుందరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు డివైడర్లను ఆనుకొని ఏర్పాటు చేయగా, జెండా కూడలిలో ఒక వైపు ఇప్పటికే రాజీవ్‌గాంధీ విగ్రహం ఉంది. ఇటీవల మరోవైపు కాన్షీరాం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమం లోనే విగ్రహాల ఏర్పాటుకు నేతల పోటీ పడడం అనివార్యమవుతుంది.

# వానర ఆహార వనాలు కనుమరుగు!



తంగళ్లపల్లి : గ్రామాల్లోకి కోతులు గుంపుగా వచ్చి పడుతున్నాయి. ఇళ్లు గుల్ల చేస్తున్నాయి. వాటి నుంచి రక్షించాలని జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. ఊర్లో నుంచి కోతులను అడవులకు పంపించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. దీంతో అవి గ్రామాల నుంచి తిరిగి అడవులకు వెళ్లేందుకు వానర వనాలు (మంకీఫుడ్ కోర్టులు) ఏర్పాటు చేశారు. అధికారులు చేసిన ప్రయత్నాలు మొదట్లో ఫలితాలు ఇచ్చినా, ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, పండ్ల చెట్లు లేక మళ్లీ పట్టణాలు, పల్లెల బాట పట్టి ఇక్కడే తిష్ఠ వేస్తున్నాయి. జిల్లాలో అయిదేళ్ల కిందట వానర వనాలు ఏర్పాటు చేశారు. ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో 12 వానర వనాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 87,500 పండ్ల మొక్కలను పెంచారు. త్వరగా పెరిగే వాటిని నాటారు. ఏడాదిలోపే బొప్పాయి, జామ పండ్లు కాసి కోతకు వచ్చాయి. వీటితోపాటు మునగ, సీతాఫలాలు, ఉసిరి తదితర పండ్ల మొక్కలను పెంచారు. సిరిసిల్ల మానేరు తీరాన సుమారు ఏడు ఎకరాల్లో 14 రకాలకు చెందిన రెండు వేల పండ్ల మొక్కలను పెంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు కస్బెకట్కూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్, రామలక్ష్మణపల్లె, తుర్కపల్లి, కొండాపూర్, గండిలచ్చపేట, మండెపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగులో వనాలు కొట్టుకుపోయాయి. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి, తంగళ్లపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగు ఒడ్డున పెట్టిన వనాలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మిగతా చోట్ల నిర్వహణ లేక మొక్కలు ఎండిపోవడం, ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు తినేశాయి. ఫలితంగా వానర వనాలు కొన్నిచోట్ల కనుమరుగయ్యాయి. ఉన్నవాటినైనా రక్షించినట్లయితే కోతులకు ఉపయోగపడే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 15 దశాబ్ది సంపద వనాలు

మానేరు వాగుకు ఆనుకొని ఉన్న కొన్ని వనాలు కాయలు కాసే సమయానికి వర్షాలకు కొట్టుకుపోయాయి. మిగిలిన కొన్ని చెట్లు బాగానే ఉన్నాయి. వాటిని రక్షించడంతోపాటు 9వ విడత హరితహారం కార్యక్రమంలో జిల్లాలో 24 ఎకరాల్లో 15 దశాబ్ది సంపద వనాలు ఏర్పాటు చేస్తున్నాం. బోయినపల్లి మండలంలో 10, నర్మాలలో 5 ఏర్పాటు చేశాం. వాటిలో ఇప్పటికే 11,700 మొక్కలు నాటించాం. మదన్‌మోహన్, అదనపు డీఆర్‌డీవో

# ప్రభుత్వ, పరిశ్రమ భూముల్లో ఆక్రమణలు



గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విలువైన భూములు ఆక్రమార్కుల చేతుల్లో వెళ్తున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన స్థలాలకు హద్దుల ఏర్పాటు లేకపోవడంతో పాటు పట్టామార్పిడి చేసుకోకపోవడాన్ని కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విలువైన భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. రామగుండం ప్రాంతంలో పేదల అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు దళారులు దర్జాగా కబ్జా చేస్తూ విక్రయించుకుంటున్నారు. రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని దక్కించుకోవడానికి రహదారి వెడల్పును తగ్గించి మరీ మిగతా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పేదప్రజల ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన 100 ఎకరాల భూమిలో సైతం పాగా వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు హద్దులు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వారి దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని కూడా దక్కించుకోవడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు.

పేదల ఇళ్లకోసం సేకరిస్తే...

ప్రభుత్వం పేద ప్రజల ఇళ్ల కోసం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని సేకరించింది. ఒక ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున చెల్లించిన ప్రభుత్వం వంద ఎకరాలు సేకరించి న్యూ పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అందులో 15 ఎకరాలు ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు దానిపై కన్నేశారు. అందులో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడిపల్లి శివారులోని 17 సర్వే నెంబర్ల నుంచి వంద ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఒక సర్వే నెంబరులో ఉన్న తప్పును కొంతమంది అనుకూలంగా మలుచుకుని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ప్లాట్లను విక్రయించిన దళారులు తమ దందాను కొనసాగిస్తున్నారు.రెవెన్యూ అధికారులు కూల్చివేసినా కొద్ది రోజులు దందాను నిలిపివేసి మళ్లీ మొదలు పెడుతున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

రహదారి పక్కన...సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు వదలడం లేదు. వంద ఫీట్ల రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సేకరించిన భూమికి పరిహారం చెల్లించింది. పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మేడిపల్లి నుంచి రామగుండం వెళ్లేందుకు ఏర్పాటు చేసే లింకు రోడ్డును 30 ఫీట్లకు కుదించి మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఎంతో విలువైన భూమిని అక్రమార్కులు తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సింగరేణి విస్తరణ కోసం గతంలో సేకరించిన భూముల్లో సైతం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఓసీపీ-5 కోసం సేకరిస్తున్న భూమిలో కూడా గతంలో సంస్థ పరిహారం చెల్లించిన భూములకే మళ్లీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. జనగామ, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల పరిసర ప్రాంతాల్లో భూమి రికార్డులు లేకపోవడంతో మళ్లీ వాటికే పరిహారం చెల్లించే పరిస్థితి. భూసేకరణ సమయంలో పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో సంస్థ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆయా అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# అధిక దిగుబడికి నాలుగు పద్ధతులు!

వరంగల్ : వానాకాలం సాగుకు సంబంధించి రైతులు మంచి దిగుబడి సాధించేందుకు వ్యవసాయశాఖ నాలుగు విధానాలు మేలన్న నినాదంతో ముందుకు వెళ్లనుంది. అన్నదాతలు నాలుగు విధానాలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని దీంతో భూసార పరిరక్షణతో పాటు పలు ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేస్తోంది. క్షేత్ర సందర్శనలో.. ప్రయోజనం పొందుతున్న రైతుల అభిప్రాయాలను ఇతర రైతులకు చెప్పించి బహుళ ప్రచారం చేయాలని సంకల్పించింది. నాలుగు విధానాల వివరాలివి..

వెదజల్లే పద్ధతి

వరి సాగు విషయంలో నారుమడులు తయారు చేయడం, నారు పెంచడం, నాట్లు, కలుపుమొక్కల తొలగింపు తదితర పనులకు కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీరి కూలీల కొరత ఎక్కువగా ఉంది. దీంతో వీరికి కూలీ చెల్లించడం కూడా రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని నివారించేందుకు రైతులు వెదజల్లే పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు. దీంతో సమయం, డబ్బు మిగులుతాయని, రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ప్రతి మొక్క ఎదగడానికి అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. నిరుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన రైతులతో మాట్లాడిస్తున్నారు.

భాస్వరం కరిగించే ప్రక్రియ

రైతులు పొలాల్లో వాడే ఎరువుల్లో మోతాదుకు మించిన భాస్వరం కలిసి ఉంటుంది. దీంతో భాస్వరం నిల్వలు పొలంలో పేరుకుపోయి పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. రెండేళ్ల నుంచి పొలాల్లో భాస్వరం కరిగించే గుళికలను ప్రభుత్వం అందించింది. మొదటి ఏడాది ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా అందించిన ప్రభుత్వం.. అనంతరం ఉపసంహరించుకుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న గుళికలను వినియోగించుకొని పొలాల్లో పేరుకుపోయిన భాస్వరం నిల్వలను తగ్గించుకోవాలని ప్రచారం చేస్తోంది. రెండు మూడేళ్లుగా ఈ ప్రయోగం చేసిన రైతులతో మాట్లాడించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతి క్లస్టర్‌కు కనీసం 200 ఎకరాల్లో భాస్వరాన్ని కరిగించే ప్రయత్నాలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

పచ్చిరొట్ట ఎరువు..

ఏటా వానాకాలం సాగుకు ముందే ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువును తగ్గింపు ధరలకు అందిస్తుంది. మునుపటిలా పెంటమట్టి అందించకపోవడం, గొర్రెల మందలను పెట్టించకపోవడంతో పొల్లాలో సారం పెరగడం లేదని, ఉన్నసారాన్ని అధిక మోతాదులో ఎరువులు వాడి పొలాలను నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీనికి విరుగుడుగా జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయశాఖ తాజాగా.. పచ్చిరొట్ట పెంపకం చేపట్టిన రైతుల క్షేత్ర సందర్శనలకు ఏర్పాట్లు చేస్తోంది. వ్యవసాయ విస్తరణాధికారులు పచ్చిరొట్ట ఎరువుల క్షేత్రాలకు సమీపంలోని రైతులను తీసుకెళ్లి చూపిస్తున్నారు.

ఎరువుల వాడకం..

పనిభారాన్ని తగ్గించుకునేందుకు రైతులు ఒకేసారి ఎరువులను వెదజల్లుతుంటారు. ఇది సమర్థనీయమైన విధానం కాదని నిపుణులు సూచిస్తుండడంతో వ్యవసాయాధికారులు రైతులను చైతన్యపర్చాలని నిర్ణయించారు. ఎరువులు వాడాల్సి వచ్చినప్పుడు ఒకేసారి కాకుండా మూడు విడతల్లో వినియోగించాలని సూచిస్తున్నారు. రైతులకు కొద్దిగా భారమే అయినా ఎరువులోని ప్రతి గుళికా పూర్తిస్థాయిలో మొక్కకు చేరుతుందని, వృథా తగ్గుతుందని ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఈ విధానాన్ని అనుసరించే రైతుల వివరాలను అధికారులు సేకరించనున్నారు.

వ్యవసాయం భారం కాకూడదనే..- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు కూలీల కొరత సమస్యను తగ్గించి పంట దిగుబడి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే ఈ నాలుగు విధానాలపై బహుళ ప్రచారం చేస్తున్నాం. జనగామ జిల్లాలోని 64 మంది వ్యవసాయ విస్తరణాధికారులు అనుసంధానించిన క్లస్టర్ గ్రామాలను తరచూ సందర్శించడంతో పాటు పదిమంది రైతులు కూర్చున్న చోట ఈ విషయాలు వివరిస్తున్నారు. వానాకాలంలో జిల్లాలో 1,90,000 ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశాం.

# పెసర అధరహో

సూర్యాపేట : పేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలు ధరహాసం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే పంట చేతికిరావడం.. మార్కెట్‌కు అడపా దడపా వస్తున్నా.. అధిక ధర పలుకుతోంది. మరో 20 రోజులైతే పూర్తిస్థాయిలో పంట చేతికిరానుంది. ముందుగా సాగు చేసిన రైతులు ఈలోపు పంటను విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు సోమవారం అన్నదాతలు 31 బస్తాలు(5 క్వింటాలు) తీసుకొచ్చారు. నాణ్యతను పరిశీలించిన అధికారులు గరిష్ఠ ధర రూ. 8,729 నిర్ణయించారు. జిల్లాల్లో పండించిన పెసళ్లను ఒడిశా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. అక్కడ డిమాండ్ ఉండడంతో పంట కూడా సాగు లేక పప్పు కొరత ఏర్పడుతోంది. జిల్లా నుంచి ఏటా ఈ సీజన్‌లో పెసళ్లను ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

పోటీపడి కొనుగోళ్లు.. అక్కడి కొరతను బట్టి మార్కెట్‌లో ట్రేడర్లు



పోటీపడి పెసళ్లను కొనుగోలు చేస్తున్నారు. మొత్తం 72 మంది ట్రేడర్లు ఉండగా 16 మంది మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కూడా పెసర సాగును ఎక్కువగా చేపట్టడం లేదు. దీనిని అంతర పంటగానే భావించి రైతులు రెండెకరాలలోపు మాత్రమే సాగు చేస్తున్నారు. ఎక్కువగా మిర్చి, పత్తి పంటలపై మొగ్గు చూపుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో డిమాండ్- ఫసియొద్దీన్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేటఇతర రాష్ట్రాల్లో పెసళ్లకు డిమాండ్ ఉండటంతో అధిక ధర పలుకుతోంది. అక్కడ ఎక్కువగా పప్పు వినియోగిస్తారు. అన్నదాతలు కూడా మార్కెట్‌కు నాణ్యమైన ఉత్పత్తులు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి.

# బాధ్యతలను గుర్తించేలా.. హక్కులను పరిరక్షించేలా

ఖమ్మం : విద్యార్థులను చైతన్యవంతులను చేయడమే విద్యాశాఖ ప్రధాన లక్ష్యం. వివిధ రకాల కార్యక్రమాల ద్వారా చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు విద్యార్థుల క్లబ్ పేరిట ఈ ఏడాది కూడా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. విద్యార్థుల క్లబ్బులతో ప్రభుత్వ బడుల బలోపేతానికి యత్నిస్తోంది. విద్యార్థులకు బాధ్యతలు గుర్తించేలా చేయడం, వారి హక్కులను పరిరక్షించేందుకు క్లబ్బులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులకు గతంలోనే శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకంగా ఈ అంశాన్ని పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

రాయాలి.. చెప్పాలి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పాఠశాలలపై అత్యవసర టోల్ ఫ్రీ నంబర్లను రాయించనున్నారు. విద్యార్థుల కోసం 1098 నంబరును విధిగా రాయించాలి. పిల్లలు వేధింపులకు గురైనప్పుడు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులు స్పందించాలి. పోలీసు సేవల కోసం 100 ఫోన్ నంబరును రాయించాలని ఆదేశాలు అందాయి. వీటిని గోడలపై రాయించడమే కాకుండా ఉపాధ్యాయులు వాటి అవసరాన్ని, ప్రాముఖ్యతను ప్రత్యేకంగా విద్యార్థులకు వివరించాలి.



తరచూ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది.

మొక్కలు.. కళలువిద్యార్థులతో రెండు రకాల క్లబ్బులు ఏర్పాటు చేస్తారు. పర్యావరణ పరిరక్షణకు ఎకో క్లబ్ నెలకొల్పి మొక్కలు నాటడం, వాటి సంరక్షణ తదితర కార్యక్రమాలు చేపడతారు. మరొకటి యువజన క్లబ్. ఆరోగ్యం, క్రీడలు, ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు దీని ఆధ్వర్యంలో నిర్వహించాలి. ఒక్కో తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా, వాటి వలన కలిగే అనర్థాలను వివరిస్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, శిథిలావస్థలో ఉన్నవాటిని మరమ్మతు చేయించుకొని ఉపయోగించు కునేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. ఈ క్లబ్బులను పాఠశాల ల్లో పూర్తిస్థాయిలో అమలు చేయడంతో విద్యార్థులు చెడుమార్గాల వైపు పయనించకుండా సన్మార్గంలో నడుస్తూ, తోటివారి పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యతను కచ్చితంగా అలవర్చుకునే అవకాశం ఉంది.

# నిధులు మెండు.. శిక్షకులు కరవు



ఖమ్మం : రూ.కోట్లు వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు కల్పించినా శిక్షకులు లేక అవి బోసిబోతున్నాయి. ఉమ్మడి జిల్లా క్రీడారంగం దాదాపు ఇదే తరహాలో ఉంది. అజయ్‌కుమార్ మంత్రి పదవి చేపట్టిన నాలుగేళ్లలో క్రీడా వసతులు, భవనాల కోసం నిధులు తెచ్చారు. నిర్మాణాల్లోనూ అదే వేగం చూపారు. కేంద్ర క్రీడాశాఖ అధికారుల బృందం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని నిర్మాణాలు చూసి ఔరా అంది. అంతా బాగుంది కానీ వసతులకు తగిన శిక్షకులు లేరు. వారి నియామకాలు లేవు. వసతులను కాపాడుకునే నేపథ్యంలో అందుబాటులో ఉన్న వారిని శిక్షకులుగా కొనసాగిస్తున్నారు.

శిక్షకులను నియమిస్తే ప్రయోజనం

నిర్మాణాలు, సదుపాయాలు ఉన్నా శిక్షకులు లేకపోవడంతో క్రీడాకారులు ఎదగలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శిక్షకుల నియామకం ఆలస్యం చేస్తే జరిగిన అభివృద్ధికి అర్థం ఉండదని క్రీడా నిపుణులు అంటున్నారు. స్టేడియంలో అథ్లెటిక్స్, వాలీబాల్ అంశాలకు క్రీడాశాఖ శిక్షకులు ఉన్నారు. ఇక్కడ ఫలితాలు సాధిస్తున్న క్రీడాకారులకు, వారి సర్టిఫికెట్లకు గుర్తింపు ఉంటోంది. క్రీడా కోటాలో మంచి ఉద్యోగాలు వస్తున్నాయి. అలాంటి ప్రగతి మిగిలిన అంశాల్లో ఉండటం లేదు. శిక్షణ కేంద్రంలో ఎవరు ఏం చేస్తున్నారో పరిశీలన లేదు. జాతీయం, అంతర్జాతీయం అని తెస్తున్న ఫలితాలను విశ్లేషించే వ్యవస్థ లేదు. కనీసం రెండేళ్లకోసారైనా జిల్లా యువజన క్రీడల శాఖ ఛైర్మన్ అయిన కలెక్టర్ అధ్యక్షతన క్రీడా సమీక్ష జరగడం లేదు. కొంత ఫీజు చెల్లించి సమయం ఉన్నప్పుడు ఆడుకొని వెళ్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. శిక్షకులను నియమించి సానపడితే మంచి క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

సదుపాయాల్లో ముందంజ

సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.కోటి ఖర్చుతో ఉడెన్ షెటిల్ కోర్టు ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మించారు.

రెండు బ్యాడ్మింటన్ కోర్టులు సరిపోవడం లేదదని రూ.కోటిన్నర నిధులు వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలున్న బ్యాడ్మింటన్, జిమ్నాజియం సౌధాలను సిద్ధం చేశారు రీ ఓ ఈత కొలను సరిపోవడం లేదని యుద్ధ ప్రాతిపదికన మరోటి నిర్మించారు.

మూడు లాన్‌టెన్నిస్ కోర్టులు నిర్మిస్తే, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు అర్హత ఉంటుందని.. రూ.కోటి వెచ్చించి ఆస్ట్రేలియాలోని అంతర్జాతీయ టెన్నిస్ ప్రాంగణం తరహా కోర్టులను సిద్ధం చేశారు.

స్కేటింగ్ సదుపాయాల కోసం రూ.50 లక్షలు ఖర్చు చేసి అధునాతన వర్టికల్ స్కేటింగ్ ఎరినాను సిద్ధం చేశారు. ఫలితాలు, ప్రమాణాలు ఎలా ఉన్నా ఇక్కడ క్రీడాకారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మారిన స్టేడియం స్వరూపం, సదుపాయాలు చూసి ఖేలో ఇండియా విలువిద్య కేంద్రాన్ని మంజూరు చేసింది. నిజానికి ఈ కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరు కాగా మంత్రి పట్టుబట్టడంతో స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఇక్కడి సీనియర్ క్రీడాకారులకే శిక్షణ బాధ్యతలు అప్పగించారు.

సమీక్ష జరుపుతాం: సునీల్‌కుమార్, జిల్లా యువజన క్రీడాధికారి, ఖమ్మం జరిగిన అభివృద్ధిని వృథా కానివ్వం. క్రీడా సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, విషయం జిల్లా కలెక్టరుకు వివరించి సమావేశం తేదీని ఖరారు చేస్తాం. ఒకటి రెండు అంశాల్లోనే సందడి ఉంటోంది. ఈ పద్ధతి మారుస్తాం. అన్ని క్రీడాంశాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తాం. శిక్షకుల నియామకం అవసరం ప్రభుత్వానికి వివరించే ప్రయత్నం మొదలు పెట్టాం.

# పారిశుద్ధ్యం అధ్వానం

జగిత్యాల : పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు పెరుగుతున్నా పరిష్కారం చూపడంలో పుర అధికారులు విఫలమవుతున్నారు. ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా కాలనీల్లో పరిశుభ్రతా చర్యలు కొనసాగడం లేదు. పట్టణంలో 48 వార్డుల్లో నిత్యం 60 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఆటోలు 48, ట్రాక్టర్లు 12, స్వీపర్, డంపర్, జేసీపీ వాహనాలున్నాయి. చెత్త సేకరణకు 308 పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. కేవలం ప్రధాన రహదారులు, అభివృద్ధి చెందిన కాలనీల్లో మాత్రమే పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా కొనసాగుతోంది. శివారుకాలనీలు, ఇరుకైన వీధులున్న కాలనీలు, విలీన వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు ఏటేటా అధికమవుతున్నాయి. ఆర్ఎన్‌టీనగర్, గోవిందుపల్లి, గోత్రాలకాలనీ, మోతెరోడ్డు, గాంధీనగర్, ఉప్పరిపేట, విజయపురి, ధర్మపురిరోడ్డు, విద్యానగర్, జాంబాగ్, టిఆర్‌నగర్, లింగంపేట, తులసినగర్‌లో చెత్తను సక్రమంగా సేకరించడంలేదనే ఫిర్యాదులొస్తున్నాయి. రహదారుల శుభ్రత నెలకోసారైనా చేపట్టడంలేదు. ఈ సమస్యలపై ఫిర్యాదులెన్ని వచ్చినా అధికారులు స్పందించడంలేదు. ప్రతినెలా సాధారణ సమావేశంలో సభ్యులు ప్రశ్నించినా పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు.

మరమ్మతు సాకు

పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది తరచూ వాహనాల మరమ్మతు సాకుగా చూపుతున్నారు. అధికారులు చెప్పే గణాంకాల ప్రకారం ప్రస్తుతం స్వీపింగ్ యంత్రం, బ్లేడ్‌ట్రాక్టరు, ట్రాక్టరు, 6 ఆటోలు, రెండు ఫాగింగ్ యంత్రాలు పనిచేయడంలేదని సమాచారం. ప్రతినెలా



వాహనాలు మరమ్మతుకు గురవుతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు మరమ్మతు పేరిట ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా వాహనాల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం గమనార్హం.

పొంచి ఉన్న వ్యాధులుప్రస్తుతం సీజనల్ వ్యాధులు పెరిగే తరుణం. దోమల ఫాగింగ్ అటకెక్కింది. 4 ఫాగింగ్ యంత్రాల్లో రెండు పనిచేయక పోగా ఉన్న రెండింటిని వృథాగా ఉంచారు. పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగాయి. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు వార్డుల్లో ఎలాంటి అవగాహన చర్యలు చేపట్టడంలేదు. డెంగీ, ఇతర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఓవైపు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించినా పారిశుద్ధ్య అధికారుల్లో చలనం లేకుండాపోయింది.

కుక్కలు, కోతుల బెడద

పట్టణంలో కుక్కలు, కోతులు విజృంభిస్తున్నాయి. వీటి నివారణకు పుర అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దాదాపు అన్ని వార్డుల్లోనూ కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడులకు దిగుతున్నాయి. కోతులైతే ఇళ్లలో చొరబడి దొరికినవాటిని తీసుకెళ్తున్నాయి. ప్రజలు కౌన్సిలర్లకు మొర పెట్టుకున్నా తామేం చేయలేకపోతున్నామనే ఆవేదన వారు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎన్నికల పోరు.. అసంతృప్తుల హోరు



ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీలు జోరు పెంచుతున్నాయి. భారాస ఇప్పటికే అభ్యర్థుల జాబితా ప్రకటించి రేసులో ముందువరుసలో నిలవగా.. అక్కడక్కడ అభ్యర్థులు ప్రచారం మొదలుపెట్టారు. అదే సమయంలో అధికార పార్టీలో అసంతృప్త జ్వాలలు రగులుతున్నాయి. ఆశావహుల నుంచి కాంగ్రెస్ దరఖాస్తులను స్వీకరించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పది స్థానాలకు 103 మంది అర్జీలు సమర్పించటంతో అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారనుంది. అమిత్‌షా సభ విజయవంతంతో ఈసారి ఎన్నికల్లో సత్తా చాటాలని భాజపా ఉవ్విళ్లూరుతోంది.పాలేరులో సిట్టింగ్ ఎమ్మెల్యే కందాళకు టికెట్ దక్కడంతో మాజీ మంత్రి తుమ్మల భగ్గుమన్నారు. ఇటీవల బలప్రదర్శన చేయటమే కాకుండా రాబోయే ఎన్నికల బరిలో నిలుస్తానని ప్రకటించారు. తుమ్మల రాజకీయ పయనమెటు అన్న చర్చ జోరుగా సాగుతోంది. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తన నివాసంలో అనుచరులతో సమాలోచనలు జరుపుతున్నారు. సెప్టెంబర్ మొదటివారంలో తుమ్మల రాజకీయ పయనంపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది.

వైరాలో సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌కు టికెట్ దక్కింది. ఎమ్మెల్యే రాములునాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ భవిష్యత్తుపై పార్టీ పెద్దల నుంచి భరోసా దక్కటంతో అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యమంటున్నారు. ఎమ్మెల్యే అనుచరులు కొత్త అభ్యర్థికి ఏమేరకు సహకరిస్తారో చూడాల్సి ఉంది. మధిరలో జడ్పీ ఛైర్మన్ కమల్‌రాజుకు టికెట్ దక్కటంతో భారాస వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన బొమ్మెర రామ్మూర్తి అలకబూనారు. పార్టీ నాయకత్వం తీరుపై నిరసన తెలుపుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ టికెట్ తనకు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు.

కొత్తగూడెంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు టికెట్ కేటాయించటంతో మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే ఆస్కారముంది.

ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ అభ్యర్థిత్వాన్ని ఖరారవటంతో అసంతృప్తి సెగలు రాజుకున్నాయి. కామేపల్లి, బయ్యారం, ఇల్లెందులో పలువురు ముఖ్యనేతలు ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

భద్రాచలంలో ఇటీవల పార్టీలో చేరిన తెల్లం వెంకట్రావుకు టికెట్ దక్కడంపై స్థానిక నాయకులు గుస్సాతో ఉన్నారు. తాము బరిలో నిలుస్తామని బుచ్చయ్య వర్గం బహిరంగంగా చెబుతోంది.

కాంగ్రెస్‌కు కత్తిమీద సామే

కాంగ్రెస్‌లో టికెట్ల పోరు రసవత్తరంగా మారుతోంది. ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు 37 మంది, భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు 66 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి 36 మంది టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఖమ్మం-6, పాలేరు-15, వైరా-9, సత్తుపల్లి-5, మధిర-2, కొత్తగూడెం-8, అశ్వారావుపేట-7, ఇల్లెందు-36, పినపాక-11, భద్రాచలం నుంచి నలుగురు అర్జీ పెట్టుకున్నారు. అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్‌కు కత్తిమీద సాము కానుంది.

అభ్యర్థుల అన్వేషణలో భాజపా..

ఖమ్మంలో భాజపా అగ్రనేత అమిత్‌షా బహిరంగ సభకు ఆదరణ కనిపించటంతో రాబోయే ఎన్నికలపై కాషాయదళం గంపెడాశలు పెట్టుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి అభ్యర్థుల ఎంపికపై నివేదికలు రూపొందించారు. రాష్ట్ర నాయకత్వం త్వరలో సమీక్ష జరిపి అభ్యర్థుల జాబితా ప్రకటించనుంది.

బలమున్న స్థానాల్లో కమ్యూనిస్టు పార్టీలు..

మిత్రధర్మం మరిచి భారాస అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో కమ్యూనిస్టులు సొంతంగా బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇతర పార్టీలతో పొత్తుల్లేకున్నా సీపీఎం, సీపీఐ కలిసి ఉభయ జిల్లాల్లో సత్తా చాటాలని భావిస్తున్నారు. ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు ఇద్దరూ ఇక్కడి వారే కావడంతో బలమున్న స్థానాల్లో పోటీకి సై అంటున్నారు. పాలేరు, భద్రాచలం నుంచి సీపీఎం, వైరా, కొత్తగూడెం నుంచి సీపీఐ బరిలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే సమీకరణాలు మారొచ్చు.

# ముందుకు సాగని మురుగు కాల్వల నిర్మాణం

జనగామ : జనగామ పురపాలిక పరిధిలో వరద, మురుగునీటి సమస్య నివారణకు రూ.9.10 కోట్లతో చేపట్టిన కాల్వల నిర్మాణ పనులు పది రోజులుగా నిలిచిపోయాయి. ప్రజారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలు కురిసి, చెరువులు మత్తడి పోసిన సమయంలో పనులు చేపట్టారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో పనులు చేపట్టే అవకాశమున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

పలుచోట్ల పెండింగులోనే..జనగామ పట్టణంలోని రంగప్ప చెరువు వరద నీరు మురుగునీటితో కలిసి పలు కాలనీల్లో ప్రవహిస్తుంది. హైదరాబాద్ ప్రధాన రహదారి, బాలాజీనగర్ తదితర కాలనీల ద్వారా గార్లకుంట అక్కడి నుంచి నెల్లుట్ల చెరువులోకి వెళ్తుంది. వరద నీటి ముప్పును తప్పించేందుకు రూ.9.10 కోట్ల అంచనా వ్యయంతో పనులు మంజూరయ్యాయి. మార్చి 14న కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. చౌరస్తా నుంచి సెయింట్ మేరీస్ క్రాస్ రోడ్డు వరకు ఒక వైపు, చర్చి వెనుక నుంచి కొత్త కుర్మవాడ క్రాస్ రోడ్డు వరకు మరోవైపు కాల్వల నిర్మాణం పూర్తయింది. ఇప్పటి వరకు రూ.కోటి విలువైన పనులు జరిగాయి. పనులను నెలలోగా పూర్తి చేయాలని అప్పట్లో ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి అధికారులను, గుత్తేదారును ఆదేశించారు. కానీ పలు కారణాలతో నేటికీ పూర్తి కాలేదు. సాయినగర్ క్రాస్ రోడ్డు నుంచి సెయింట్ మేరీస్ కూడలి వరకు ఇరువైపులా కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. చౌరస్తా నుంచి రెండు వైపులా కొత్తగా నిర్మించిన కాల్వలను అనుసంధానించే కల్వర్టుల పనులు పెండింగులోనే ఉన్నాయి. కాల్వలు పూర్తయిన ప్రాంతంలో రహదారిని వినియోగంలోకి తేవాల్సి ఉంది. వరద నీరు రోడ్డు మీది నుంచి కాల్వల్లోకి వెళ్లేలా దారులను వదలాల్సి ఉన్నా, దుకాణదారులు కాల్వలపై కప్పు, మెట్లు నిర్మిస్తున్నారు. రోడ్లపైకి వస్తువులను పేరుస్తున్నారు.

రూ.28 కోట్ల కోసం ప్రతిపాదనలు

మురుగు, వరద నీటి మళ్లింపునకు గార్లకుంట వరకు పనులు జరగాలంటే రూ.9.10 కోట్లు చాలవని చెబుతున్నారు. అదనంగా మరో రూ.28 కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అన్ని కాల్వల్లోని నీటిని ఒక వైపు నుంచి కాకుండా మరో దారిలో మళ్లించేందుకు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తారని సమాచారం. రూ.కోట్ల విలువైన కాల్వల నిర్మాణం చేపట్టే ముందు స్థల నిర్ధారణ చేసి కొలతలు వేయాలి. ఇవేవీ లేకుండా ఎక్కడ వీలైతే, ఎలా వీలుంటే అలాగే అన్న చందంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కాల్వ పనులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక దారి తప్పిందా?వరద సమస్య నివారణకు ప్రధాన రహదారికి ఇరువైపులా కాల్వలతో పాటు సెయింట్‌మేరీస్ క్రాస్ రోడ్డు మీదుగా, బాలాజీనగర్, జ్యోతినగర్ క్రాస్ రోడ్డు, గార్లకుంట వరకు కాల్వలు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో పలు చోట్ల రహదారులు పది అడుగుల వెడల్పు కూడా లేవు. పలు చోట్ల ప్రైవేటు ప్లాట్లు ఉన్నాయి. అలైన్‌మెంట్ నిర్ధారించకుండా, పైపైన పరిశీలించి ప్రణాళిక రూపొందించినట్లు స్పష్టమవుతోంది. నాలుగు వైపుల నుంచి వచ్చే నీటిని సెయింట్ మేరీస్ రోడ్డు వెంట మళ్లించేందుకు రహదారి ఉన్నంత మేర కాల్వ నిర్మించాల్సి ఉంది. ఇక్కడ స్థలం ఉన్నా ముందుకు వెళ్లే కొద్దీ ఇందులో పావు వంతు కూడా స్థలం లేదు. ఆచరణ సాధ్యం కాని ప్రణాళికకు ప్రత్యామ్నాయం ఏమిటనే విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

# బాలికల భవిష్యత్తుకు భరోసా

ధర్మపురి : జిల్లాలోని 14 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు జీవన నైపుణ్యాల బోధన ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఎంతో దోహదపడుతోంది. కౌమారదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం పెంపుదల వంటి వాటిని వివరిస్తూ వారిలో భరోసా కల్పించేలా కృషి చేస్తున్నారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల విద్యకు సంబంధించి పాఠ్య పుస్తకాలను ప్రచురించి 6,7,8 తరగతుల విద్యార్థులకు అందజేసి ప్రత్యేక శ్రద్ధ నిలుపుతున్నారు. ఒత్తిడి నియంత్రణ, పరస్పర సహకారం, సృజనాత్మకత విధానం, సమస్యలను ఎదుర్కోవడం తదితర అంశాలపై వివిధ కృత్యాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవలి కాలంలో చరవాణుల వినియోగం బాగా పెరిగింది దాని వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో శృతి మించితే దుష్పరిమాణాలున్నాయని బోధిస్తున్నారు. హక్కులు, బాధ్యతలు, చట్టాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు స్పందించాల్సిన తీరును వివరిస్తున్నారు. వీటితో పాటు, నిరంతర అభ్యసనం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం ముఖ్యంగా విద్య ప్రగతి లక్ష్యాలను ఎలా సాధించాలో వివరిస్తున్నారు. జిల్లాలోని 14 కేజీబీవీల్లో సుమారు 2800 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం



చేస్తుండగా వీరిలో 6,7,8 తరగతుల్లో 1500 మంది విదార్థినులు ఉన్నారు. వీరంతా జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకుంటున్నారు.

ఎంతో ఉపయోగం

బాలికల విద్యాభివృద్ధితో పాటు నిత్య జీవనంలో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్నాం. ఇవి విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. 6, 7, 8 తరగతుల వారికి ప్రతి వారంలో మూడు తరగతులను ఏర్పాటు చేసి బోధిస్తున్నాం. ఇవన్నీ బాలికలకు ఉత్తమ విలువలను పెంచుతాయి. భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.

శ్రీలత, ప్రిన్సిపల్, కేజీబీవీ, ధర్మపురి

శ్రద్ధగా వింటున్నాం

జీవన నైపుణ్యాల తరగతులు ఎంతో శ్రద్ధగా వింటున్నాం. చదువుతో పాటు, మాలో ఆత్మవిశ్వాసం, బయట ప్రపంచం తీరు తెన్నులు, విలువలు తెలుస్తున్నాయి. మేమే కృత్యాలు చేస్తూ అవగాహన కల్పించుకుంటున్నాం.

కె.వైష్ణవి, 8వ తరగత

# స్థానిక సంస్థలకు నిధులు విడుదల

ఆలేరు : స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ 15 ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు రూ. 17.26 కోట్లు మంజూరయ్యాయి. జనాభా ప్రాతిపదికన జిల్లాపరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా జిల్లాకు రూ. 17.26 కోట్లు విడుదల చేసింది. గ్రామ పంచాయతీల్లో నివసిస్తున్న జనాభా ప్రకారం ఈ నిధులను కేటాయించారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు మొదటి విడత, అక్టోబరు నుంచి మార్చి వరకు రెండో విడతగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. వీటిని 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ జనాభా ఆధారంగా కేటాయిస్తారు. అధిక జనాభా ఉండే గ్రామపంచాయతీలకు ఎక్కువగా, తక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు తక్కువ నిధులు కేటాయిస్తారు. వీటిని పాలకవర్గం తీర్మానంతో ఖర్చు చేయనున్నారు. జిల్లాలోని 844 పంచాయతీలకు రూ.14.82 కోట్లు, మండల పరిషత్తులకు రూ.1.98 కోట్లు, జిల్లా పరిషత్‌కు రూ.52 లక్షలు విడుదలయ్యాయి.

# చరిత ఘనం.. ప్రగతి శూన్యం

రాయికల్ : రాయికల్ మండల కేంద్రంలోని అతి పురాతన ప్రాచీన ఆలయం శ్రీ చెన్నకేశవనాథ పంచముఖ లింగేశ్వరాలయం పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. జువ్వాడి రత్నాకర్‌రావు దేవాదాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినా గుత్తేదారు నామమాత్రంగా పనులు చేపట్టి వదిలేశారు. దీంతో ఘనమైన చరిత్ర ఉన్న ఆలయం అభివృద్ధిలో మాత్రం అథమంగా ఉంది. ఆలయం దక్షిణ ముఖాన్ని కలిగిఉ ండటంతో అప్పటి ఏఎన్ఎల్ పార్సిల్ సర్వీస్ ఎండీ కృష్ణారావు, ఇతర దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయం ఎదురుగా వినాయకుడి గుడి నిర్మించారు. ప్రధాన దేవాలయంలోని కేశవనాథస్వామి, సూర్యనారాయణుడి విగ్రహాలతోపాటు నవగ్రహ దేవతలను ప్రతిష్ఠించారు. దాతల సహకారంతోనే సుమారు రూ.3లక్షలతో నవగ్రహ విగ్రహాలకు మండపాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం కార్తిక మాసం, శివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 18న శివరాత్రి ఉత్సవాలు, శివపార్వతుల కల్యాణం, 19న జాతర నిర్వహించనున్నారు.

ఆలయ విశిష్టత

రాయికల్ పెద్ద చెరువుకు తూర్పున చాళుక్యుల శిల్పకళా రీతులతో నిర్మించబడిన శ్రీ చెన్నకేశవనాథ పంచము లింగేశ్వరాలయం(గుడికోట) 11వ శతాబ్దానికి చెందనది కాగా ఆలయ శాసనములను కాకతీయుల కాలం క్రీ.శ 1305లో వేశారు. ఈ గుడి ఒకప్పుడు కోటలో ఉ ండటం వలన గుడికోట అని, మూడు ఆలయాలు ఉండడంతో



త్రికూటాలయం అని పిలుస్తారు. ఈ ఆలయం దక్షిణ ముఖమును కలగి ఉండుట అరుదైన విషయం. ఆలయానికి ఉన్న మూడు శిఖరాలు అలంపురము, మహానంది, సత్యవోలు ఆలయముల శిఖరములను పోలి ఉంటాయి. ఆలయంలోని పడమటి గర్భగుడిలో ఒకే ఫలకముపై మధ్యనున్న శివ లింగమునకు నాలుగు మూలాలందు నాలుగు లింగములు చెక్కబడి ఉన్న పంచముఖ లింగేశ్వరాలయం, ఉత్తర గర్భగుడిలో కేశవనాథుడు, తూర్పు గర్భగుడిలో సూర్య దేవులు కొలువై ఉన్నారు. హన్మకొండలోని వేయిస్తంభాలగుడిలో ఉన్న శైవ, వైష్ణవ, సౌర అను మూడు ఆలయముల మాదిరిగా త్రికూటాలయం పోలీ ఉ ంటుంది.

వసతులు కల్పిస్తే పర్యాటక కేంద్రంగా గుర్తింపు పెద్ద చెరువుకు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాచీన ఆలయంలో ఉన్న పంచముఖ లింగాన్ని శివరాత్రి పర్వదినాన ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏటా వేడుకలు, ఉ త్సవాల నిర్వహణకు సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుండగా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో తాత్కాలికంగా అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసుకొని నిధుల సేకరణ జరిపి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 2018లో ఆలయం ఆవరణలో వేడుకల నిర్వహణ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.కోటి మంజూరైనా నేటికి పనులు ప్రారంభం కాలేదు. ఆలయం సమీపంలోని పెద్ద చెరువుపై మినీ ట్యాంక్‌బండ్, ఉద్యానవనం నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూ రు కాగా గత సంవత్సరం పనులు ప్రారంభమై ప్రగతి దశలో ఉ న్నాయి. దూప దీప నైవేద్యం కోసం మినహా ఇతర నిధులు లేకపోవడం తో ఆలయ నిర్వహణ కష్టంగా ఉంది.పురాతన ఆలయాన్ని పురావస్తు, టూరిజం, ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.· రాయికల్ పురపాలక సంఘంగా మారడంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తే పర్యాటక కేంద్రంగా మారుతుందనడంతో సందేహం లేదు. ఆలయంలో శ్రీదేవి, భూదేవిలతో వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న కారణంగా ఆలయంలో బ్రహ్మోత్స వాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# గౌరవ వేతనం గాలికేనా!

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏటా అంబేడ్కర్ స్టేడియం వేదికగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తుంటారు. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల పిల్లలను ఇక్కడకు వస్తుంటారు. 2017లో అప్పటి మున్సిపల్ కమిషనర్ శశాంక ఈ శిబిరాలకు శ్రీకారం చుట్టగా, ఇప్పటి వరకు నాలుగుసార్లు నిర్వహించారు. 2022 మేలో సుమారు 70 మంది కోచ్‌లు 3 వేల మందికి తర్ఫీదు ఇచ్చారు. వారికి నగర పాలక సంస్థ గౌరవ వేతనం ఇప్పటికీ ఇవ్వలేదు.

ఏడు నెలలు అయినా..

2022 మే 9 నుంచి జూన్ 10 వరకు 28 అంశాల్లో మెలకువలు నేర్పించారు. కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం ఆనవాయితీ కాగా శిబిరాలు ముగిసి ఏడు నెలలైనా ఇవ్వలేదు. కోచ్‌ల క్రీడా కిట్లు ఇవ్వడంలో కరీంనగర్ నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవి సెలవుల్లో అందరూ విహారయాత్రలకు వెళ ్తుంటే 70 మంది మాత్రం విద్యారులకు క్రీడా నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా శిక్షణలో నిమగ్నమయ్యారు. ఆ తర్వాత వారి సేవలను మరిచిపోయారు. మళ్లీ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఇవ్వాలని కోరుతున్నారు. కోచ్‌లు మేయర్, డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యులకు విన్నవించుకున్నా లాభం లేకుండా పోయింది. 2018, 2019లో పాల్గొన్న కోచ్‌లకు ఆరు నెలల తర్వాత ఇచ్చారు.

28 క్రీడలు.. 70 మంది కోచ్‌లు

వేసవిలో సుమారు 28 క్రీడాంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. వీరందరికీ 70 మంది కోచ్‌లు మెలకువలు నేర్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, విలువిద్య, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చదరంగం, క్రికెట్, సైక్లింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్, హాకీ, తైక్వాండో, జూడో, కరాటే, కిక్ బాక్సింగ్, స్కేటింగ్, వాటర్‌స్పోర్ట్స్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, యోగా, షూటింగ్ బాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వగా సుమారు మూడు వేల మందికిపైగా చిన్నారులు హాజరయ్యారు.

ఈ నెలాఖరు వరకు విడుదల చేస్తాం

కోచ్‌లకు ఈ నెలలోపు గౌరవ వేతనం అందిస్తాం. వారి జాబితా తయారీలో ఆలస్యం జరగడంతో ఇప్పటికీ ఇవ్వలేకపోయాం. గత కౌన్సిల్ తీర్మానంలో ఇవ్వాలని నిర్ణయించాం.

వై.సునీల్‌రావు, నగర మేయర్

# విద్యార్థుల ఎదురుచూపు



కొత్తగూడెం : దృష్టి లోపాలను సరిచేసేందుకు 'కంటివెలుగు' రెండో దశను ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి కంటిపరీక్షలు జరిపి అవసరమైన వారికి కళ్లద్దా లు అందేలా చూస్తోంది. శస్త్రచికిత్స అవసరమైన వారిని వైద్యసిబ్బంది గుర్తిస్తున్నారు. ఈ శిబిరాల్లో తమకు సైతం నేత్రపరీక్షలు నిర్వహించాలని పాఠశాల, ఇంటర్ విద్యార్థులు కోరుతున్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు సాధారణ పరీక్షలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో 'కంటివెలుగు' శిబిరాలకు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థుల ను అనుమతిస్తే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుంది.

బాలబాలికల్లో దృష్టిలోపాలు అధికం

విద్యార్థుల్లో దృష్టిలోపాలు అధికం. వీరు తల్లిదండ్రులకు చెప్పకపోవడం, దృష్టిలోపమని గుర్తించకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. పాఠశాల, ఇంటర్ కళాశాలల్లో బ్లాక్‌బోర్డుపై అక్షరాలు కనిపించని బాలబాలికలు 10-20 మంది చొప్పున ఉంటున్నారు. పాఠశాల స్థాయిలో గతంలోనే 4,900 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొవిడ్ తరువాత ఈ సంఖ్య మరింత పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పోషకాహార లోపం వల్ల అధిక మంది గిరిజన విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రైవేటుగా పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు తీసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.2500 వరకు ఖర్చవుతుంది. 'కంటివెలుగు' కార్యక్రమంలో వీరిని చేర్చటం ద్వారా ఆ భారాన్ని తగ్గించవచ్చు.

వివరాల నమోదు సమయంలో..

గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు పాఠశాల విద్యార్థులకు సైతం అవకాశం కల్పించాలి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా విద్యాలయాలకు సమయం కేటాయించి పరీక్షలు చేయాలి. ఇటీవల తల్లాడ మండలంలో దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులను తీసుకుని ఉపాధ్యాయులు శిబిరానికి వెళితే అనుమతి లేదని వెనక్కి పంపించారు. కొన్ని ప్రాంతాల్లో సాధారణంగా పరీక్షలు చేస్తున్నా అనేకచోట్ల నిరాకరిస్తున్నారు. నేత్రపరీక్షలకు వచ్చే వారి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. 18 ఏళ్లు పైబడిన వారికి ఉపయోగపడేలా పోర్టల్‌ను రూపొందించటంతో అంతకంటే చిన్న వయస్సు వారిని అందులో నమోదు చేయటం ఇబ్బందిగా మారింది. ఈకారణంతోనే శిబిరాల్లో విద్యార్థులకు పరీక్షలు చేయడానికి సిబ్బంది సుముఖత చూపడం లేదు. పోర్టల్‌ను సరిచేసి విద్యార్థులకు సైతం అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# భోజనంలో నాణ్యత.. వేతనాల్లో 'గౌరవం'



కొత్తగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యాలయాల్లో సంయుక్తంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులకు భోజనం తయారు చేసి వడ్డిస్తున్న ఏజెన్సీలు ఏళ్లుగా బిల్లుల సమస్యతో బాధపడుతున్నాయి. నిర్వాహకులు గౌరవ వేతనాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి మెనూ ఛార్జీలు పెంచుతూ నాణ్యమైన భోజనం అందించేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆపై తాజాగా భోజనాలు తయారు చేసే కార్మికుల గౌరవ వేతనాలను పెంచింది. గతంలో ఉన్న రూ.వెయ్యిని ఏకంగా రూ.3 వేలకు పెంచుతూ సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఉత్తర్వులు సైతం జారీ కావడం విశేషం. ఫిబ్రవరి నెల నుంచే ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి. తద్వారా ఉమ్మడి ఖమ్మంలో 4,500 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. నిర్ణయంతో పాటు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని వీరందరూ కోరుతున్నారు.

ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకుల మెనూ ఛార్జీలతో పాటు గౌరవ వేతనం పెంచడం కాస్త ఊరట కలిగించే అంశం. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.600, రాష్ట్ర ప్రభుత్వం రూ.400 వేతనంగా ఇచ్చేవి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే మరో రూ.2 వేలు అదనంగా ఇస్తోంది. కోడిగుడ్డు ధర గతంలో రూ.4గా ఉండగా.. మరో రూపాయి పెంచారు.

ఎన్.సత్య సూర్యప్రసాద్, డీఈఓ, భద్రాద్రి

ప్రతి నెలా గౌరవ వేతనాలు సకాలంలో చెల్లించాలి. మెనూ ఛార్జీలు పకడ్బందీగా విడుదల చేస్తే నాణ్యమైన భోజనం అందజేయడంలో ఇబ్బందేమీ ఉండదు.

యనమల కృష్ణవేణి, పాల్వంచ బాలికోన్నత పాఠశాల

మార్కెట్‌లో నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఎప్పటికప్పుడు పెంచుతూ వర్తింపజేయాలి. అప్పుడే నాసిరకం భోజన సమస్య పరిష్కారం అవుతుంది. గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలి. గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తే మరింత ప్రయోజనంగా ఉ ంటుంది.కోట పద్మ, ఎంపీపీఎస్ వంట సిబ్బంది, కొణిజర్ల

# పంచాయతీల విభజన షురూ

భద్రాచలం : భద్రాచలం, సారపాక పంచాయతీల విభజన ప్రక్రియ ప్రారంభమైంది. భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వు- 45 జారీచేసింది. దీనికి అనుగుణంగా శాసనసభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బిల్లు ప్రవేశపెట్టారు. భద్రాచలం, సీతారామ్‌నగర్, శాంతినగర్‌గా పేర్లు ఖరారు చేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన భద్రాచలం రాష్ట్ర విభజన తర్వాత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని వివరించారు. శాసనసభలో బిల్లు ఆమోదం పొందితే త్వరలో ఎన్నికలు జరిగే ఆస్కారముంది.

భద్రాచలం, సీతారామనగర్, శాంతినగర్...భద్రాచలం పంచాయతీ విస్తీర్ణం 700 ఎకరాలు. ఇందులో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, పంచాయతీ కార్యాలయం, పాతమార్కెట్, వ్యాపార సముదాయం గల యూబీ రోడ్, అభయాంజనేయ స్వామి ఆలయం, ఎంపీడీవో కార్యాలయం, ఆర్టీసీ, ఏఎస్పీ, ఆర్డీఓ, తహసీల్ కార్యాలయాలు, ఠాణాలు ఇందులో ఉన్నాయి. సీతారామనగర్ పంచాయతీ విస్తీర్ణం 350 ఎకరాలు. ఇందులో అంబేద్కర్ సెంటర్, కొత్త మార్కెట్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, అటవీశాఖ కార్యాలయం, సీతారామనగర్ కాలనీ, రాజుపేట కీలకమైన ప్రాంతాలు. శాంతినగర్ పంచాయతీ విస్తీర్ణం 1,000 ఎకరాలు. ఇక్కడ ఐటీడీఏ కార్యాలయం, మెడికల్ కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, శాంతినగర్, డిగ్రీ కళాశాల ప్రాంతం, సుభాశ్‌నగర్ ఉన్నాయి. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించడాన్ని కొందరు వ్యతిరేకించగా మరికొందరు



సమర్థించారు. ప్రభుత్వం మూడు పంచాయతీల ఏర్పాటుకే మొగ్గు చూపింది.

సారపాకలో రెండు..బూర్గంపాడు మండలం సారపాక విస్తీర్ణం 4,244 ఎకరాలు. భద్రాచలానికి సారపాకను ముఖద్వారంగా చెబుతుంటారు. విభజన అనంతరం సారపాక పంచాయతీలో ప్రధానంగా భాస్కర్‌నగర్, గాంధీనగర్, బసప్పక్యాంపు, ఒడియా క్యాంపు, ప్రస్తుత గ్రామ పంచాయతీ కార్యాలయం, పాత సారపాక దీంట్లో భాగం. ఐటీసీ కర్మాగారంతో పాటు కండక్టర్స్ కాలనీ, ముత్యాలమ్మపేట, శ్రీరాంపురం కాలనీలు ఐటీసీ పంచాయతీలో ఇమిడి ఉన్నాయి.

# ఎన్‌సీడీ కిట్లు మంజూరు

రాయికల్ : రక్తపోటు, మధుమేహ బాధితుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఎన్‌సీడీ సర్వేలో గుర్తించిన రోగులకు సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నారు. కొందరు రోగులు క్రమం తప్పకుండా వాడడంలేదు. ఫలితంగా వ్యాధులు అదుపులో ఉండడలేదు. ఈ సమస్యను గర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా, ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా భద్రంగా పెట్టుకునేలా చేయడంపై దృష్టి సారించింది. ప్రతి నెల ప్రభుత్వం సరాఫరా చేసే మందులను దాచుకునేలా ప్రత్యేక కిట్లు అందించాలను నిర్ణయించింది. ఉదయం, రాత్రి మందులు వేర్వేరుగా దాచుకునేలా కిట్లు రూపొందించారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల ద్వారా రోగులకు పంపిణీ చేస్తున్నారు. ఈ కిట్లతో ప్రతినెల ఇచ్చే మందులను జాగ్రత్తగా పెట్టుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..జిల్లాలో అధిక శాతం మంది వారికి తెలియకుండానే అసంక్రమిక వ్యాధుల బారిన పడుతున్నారు. సకాలంలో పరీక్షలు చేయించుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా వైద్య సిబ్బంది గ్రామాల్లో సర్వే నిర్వహించి బాధితులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.




జిల్లా వ్యాప్తంగా 92,126 మంది ఆయా రోగులు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో బీపీ రోగులు 64,000 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు 32,666 మంది కాగా మిగిలిన వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు 28,126 మది ఉండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 12,902 మంది చికత్స తీసుకుంటున్నారు. క్యాన్సర్ రోగులు 470 మంది ఉన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ఆయా రోగులకు ప్రతినెలా మందులు అందిస్తున్నారు. వాటిని భద్రపరచుకునేందుకు జిల్లాకు మొత్తం 31,753 కిట్లు రాగా వాటిని అధికారులు పంపణీ చేస్తున్నారు. రెండు వ్యాధులున్న వారు సైతం ఉన్నారని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

భద్రపరచుకోవడం సులువైంది - నర్సయ్య, బీపీ రోగి, చౌలమద్ది

ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వైద్య సిబ్బంది అందించే నెలకు సరిపడా మాత్రలను భద్రపరచుకోవడం సులువైంది. కిట్లో ఉదయం, రాత్రి వాడే మాత్రలకు వేర్వేరు ఏర్పాట్లు ఉండడంతో ఇబ్బంది తప్పింది. కిట్ను ఎక్కడికైనా తీసుకువెళ్లవచ్చు.

ప్రతి రోగికీ అందిస్తాం..- డాక్టర్ ఎం.డి.సమియొద్దీన్, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

బీపీ, మధుమేహ వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి నెలా ఉ చితంగా మందులు అందజేయడం జరుగుతోంది. వీటిని నిర్ణీత విధానంలో భద్రపరచుకునేందుకు ప్రభుత్వం కిట్లు మంజూరు చేసింది. జిల్లాకు 31,753 కిట్లు వచ్చాయి. ప్రతి రోగికి కిట్ చేరేలా జాగ్రత్తలు తీసుకున్నాం. రెండు వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారు. రక్తపోటు, మధుమేహ మాత్రలు కిట్లో వేర్వేరుగా భద్రపరచుకోవచ్చు. ఆహార అలవాట్లు మార్చుకోవడం, తగినంత శారీరక శ్రమ చేయడంతోపాటు క్రమం తప్పకుండా మాత్రలు వాడడంవల్ల వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చు.

# నిర్ధారణకు ఎన్నాళ్లో నిరీక్షణ!

పెద్దపల్లి : పేద ప్రజలకు ఉచితంగా వైద్యం, మందులు లభిస్తున్నా.. వ్యాధి నిర్ధారణ పరీక్షల విషయంలో ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేటు కేంద్రాల్లో స్కానింగ్‌లు, ల్యాబ్‌ల పేరిట వ్యాధి నిర్ధారణ పరీక్షలకు రూ.వేలల్లో వసూలు చేస్తుండటంతో జేబులు గుల్లవుతున్నాయి. జిల్లాసుపత్రిలోనే ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం టి-డయాగ్నోస్టిక్ సెంటర్ పేరిట దాదాపు రూ.6 కోట్ల నిధుల వరకు కేటాయించి 54 రకాలైన పరీక్షలను ఉచితంగా చేసి వ్యాధి నిర్ధారణ కొన్ని గంటల్లోనే తేల్చేలా కార్యక్రమం రూపొందించింది. థైరాయిడ్, క్యాన్సర్, లిపిడ్ ప్రొఫైల్ వంటి విలువైనవి కూడా ఇందులో నిర్వహిస్తారు. మిగితా జిల్లాలతో పోల్చుకుంటే పెద్దపల్లిలో ఈ కేంద్రం ద్వారా అందించే సేవలు మరింత ఆలస్యం కానున్నాయి. జిల్లాసుపత్రి ఆవరణలోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుండగా ప్రస్తుతం మొదటి అంతస్తు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనుల పూర్తికి ఇంకో రెండు నెలలు పట్టే అవకాశముంది.

అందుబాటులోకి తెస్తే ప్రయోజనం



నిత్యం జిల్లావ్యాప్తంగా గోదావరిఖని ప్రాంతీయ ఆసుపత్రి, పెద్దపల్లి జిల్లాసుపత్రి, మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రుల్లో నిత్యం వేలల్లో ఓపీ సేవల కోసం వస్తున్నారు. వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం రామగుండంలో 55, పెద్దపల్లిలో 20, మంథనిలో 5, ధర్మారంలో 2, కమాన్‌పూర్‌లో 2.. ఇలా మొత్తం 85 మెడికల్ ల్యాబులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలున్నాయి. ఇందులో కనీస రుసుము రూ.200 నుంచి రూ.10 వేలకు పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని త్వరితగతిగా అందుబాటులోకి తెస్తే పేదవారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో టి డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటై నిత్యం వేల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మాత్రం ఇంకా నెమ్మదిగా పనులు కొనసాగుతున్నాయి.మార్చిలోగా పూర్తయ్యే అవకాశాలు- శ్రీధర్, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షకులుటి-డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణ పనులు మార్చి లోగా పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ నిర్మాణ పనులను జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కుటుంబ, సంక్షేమశాఖ వారు చేపడుతున్నారు.



# లోకేశ్ పాదయాత్రలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు

ఏలూరు: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రలో ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలో కొయ్యలగూడెంలో ప్రారంభమైన పాదయాత్రలో నారా, నందమూరి కుటుంబసభ్యులు పాల్గొని లోకేశ్ వెంట నడిచారు. లోకేశ్ తల్లి నారా భువనేశ్వరి, ఇతర కుటుంబసభ్యులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

మరోవైపు కొయ్యలగూడెం వద్ద పార్టీ కార్యకర్తలు లోకేశ్‌కు యాపిల్ గజమాలతో ఘన స్వాగతం పలికారు. 'యువగళం' పాదయాత్ర 200 రోజులు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావ పాదయాత్రలు నిర్వహించాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రల్లో తెదేపా నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తెదేపా కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేస్తానని హామీతో పైలాన్‌ను లోకేశ్ ఆవిష్కరించారు.

లోకేశ్ పాదయాత్రతో రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాక్షస పాలనను పారదోలి రామరాజ్యం తీసుకొచ్చేందుకు చంద్రబాబు ఆధ్వర్యంలో తామంతా కష్టపడి పనిచేస్తామని చెప్పారు.

# సీఎం తరపు న్యాయవాది చెప్పేవన్నీ అబద్దాలే..: అబ్దుల్ సలీం




అమరావతి: కోడికత్తి కేసులో ముఖ్యమంత్రి జగన్ తరపు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు చెబుతున్నవన్నీ అబద్దాలేనని.. అవే అబద్దాలను సాక్షి పత్రికలో ప్రచురించారని కోడికత్తి శ్రీను తరపు న్యాయవాది అబ్దుల్ సలీం అన్నారు. గురువారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి బొత్సా సత్యానారాయణ మేనల్లుడి వద్ద కోడికత్తి లభించిందని.. తన క్లయింట్ వద్ద కాదని.. దానికి ఆధారాలు ఉన్నాయన్నారు. ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ అక్రమంగా కరణం ధర్మశ్రీ , రాజన్న దొర, కొండా రాజీవ్ గాంధీ, కృష్ణకాంత్, సుధాకర్ లను ఎయిర్ పోర్టు వీఐపీ లాంజ్‌లోకి తీసుకువచ్చారని, వారి వద్ద ఎలాంటి పాసులు, పర్మిట్‌లు లేవని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తన కక్షిదారుకు ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని, నాలుగేళ్లుగా జగన్ రెడ్డి సిఎంగా ఉండి ఏం చేస్తున్నారని న్యాయవాది అబ్దుల్ సలీం ప్రశ్నించారు. ఇంత వరకూ ఆయన సిట్ రికార్డులను ఎన్ఐఏకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్ఐఏ జగన్ రెడ్డితో, కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కు అయ్యిందని, తన క్లయింట్‌పై అసత్య ప్రచారం చేసి అభియోగాలు మోపి.. జైలులో ఉంచారని అన్నారు. ఐదేళ్లుగా జైలులో ఉంచి బెయిల్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. దళితుడైన తన క్లయింట్‌కు ఇప్పటికైనా న్యాయం జరగాలని కోరారు. జగన్ కోర్టుకు రావాలి... అప్పుడు అతని లాయర్ చెప్పినవన్నీ అబద్దాలని నిరూపిస్తానని న్యాయవాది అబ్దుల్ సలీం స్పష్టం చేశారు.




ముంబయి: అదానీ గ్రూప్ అక్రమాలపై ఇవాళ పలు పత్రికల్లో కథనాలు వచ్చాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఒక బిలియన్ డాలర్ల ధనం భారత్ నుంచి వెళ్లి వివిధ మార్గాల్లో మళ్లీ తిరిగి వచ్చిందంటూ ఆ కథనాలు పేర్కొంటున్నాయని చెప్పారు. గురువారం ముంబయిలో విపక్ష కూటమి 'ఇండియా' సమావేశానికి విచ్చేసిన ఆయన అదానీ వ్యవహారంపై ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పెట్టుబడులతో అదానీ గ్రూపు షేర్ల ధరలు కృత్రిమంగా పెంచారు. షేర్ల పెరుగుదలతో వచ్చిన సొమ్ముతో అదానీ ఎన్నో ఆస్తులు కొన్నారు. అదానీ పోర్టులు, ఎయిర్ పోర్టులు కొనుగోలు చేశారు.

ఈ డబ్బంతా ఎవరిది.. అదానీదేనా? ఇంకెవరిదైనా? ఈ మొత్తం అక్రమాల మాస్టర్ మైండ్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ. నాసర్ అలీ, ఛాంగ్ చుంగ్ లింగ్‌దీని వెనుక ఉన్నట్టు కథనాలు వచ్చాయి. గతంలో వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్‌నకు సెబీ క్లీన్ చిట్ ఇచ్చింది. అదానీకి క్లీన్ చిట్ ఇచ్చిన వ్యక్తి ఇప్పుడు ఎన్డీటీవీలో డైరెక్టర్‌గా ఉన్నారు. దీన్నిబట్టే అదానీ గ్రూపులో ఏదో తప్పు జరుగుతోందని అర్థమవుతోంది" అని రాహుల్ అన్నారు.

**ఈ కుంభకోణంపై ఎందుకు విచారణ జరపరు? :** "అదానీ వ్యవహారంపై అంతర్జాతీయంగా ప్రముఖ ఫైనాన్షియల్ వార్తా పత్రికలు చాలా కీలక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మనది చాలా పారదర్శక వ్యవస్థ అని ప్రపంచానికి చెబుతున్నాం. ప్రధానికి సన్నిహితుడైన వ్యక్తి తన సంస్థ షేర్ల విలువ పెంచేందుకు బిలియన్ డాలర్లు విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టించారు. ఈ కుంభకోణంపై ఎందుకు విచారణ జరిపించరు?" అని రాహుల్ ప్రశ్నించారు.

**జీ20 సదస్సులో విదేశాలు ప్రశ్నిస్తే ఏం చెబుతాం? :** అదానీ గ్రూప్ వ్యవహారంపై జేపీసీతో విచారణకు ఎందుకు అనుమతించడంలేదు. విచారణ కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు చొరవ తీసుకోవడంలేదు. ఈ కుంభకోణానికి పాల్పడిన వాళ్లను జైళ్లో ఎందుకు పెట్టడంలేదు? త్వరలో దిల్లీలో జీ20 సమావేశం జరగబోతోంది. ఆ కీలక సమావేశంలో అదానీ గ్రూప్‌పై విదేశీ నేతలు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెబుతాం? ఈ అదానీ గ్రూప్.. ఎందుకు అంత ప్రత్యేక సంస్థగా మారింది. దేశ ఆర్థిక వ్యవస్థపై స్వారీ చేసేందుకు అదానీకి ఎందుకు అనుమతిస్తున్నారు. అదానీ గ్రూపు వ్యవహారంపై జేపీసీ వేసి సమగ్ర విచారణ జరిపించాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు.

# ఉద్యోగుల పిటిషన్‌పై విచారణ.. నిరసనకు మరో తేదీ చెప్పాలన్న హైకోర్టు

అమరావతి: ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు మరో తేదీని చెప్పాలని హైకోర్టు సూచించింది. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం చలో విజయవాడకు పిలుపునిచ్చింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. ఉద్యోగుల అందోళనకు తొలుత పోలీసులు అనుమతిచ్చారని, ఆతర్వాత నిరాకరించారని ఉద్యోగుల తరపు న్యాయవాది ఇంద్రనీల్ వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారమే నిరసన తెలుపుతామని చెప్పినా పోలీసులు పట్టించుకోకుండా అనుమతి రద్దు చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో చలో విజయవాడ పేరుతో ఆందోళన నిర్వహించినప్పుడు నగరంలో జనజీవనం స్తంభించిందని, ఉద్యోగుల ఆందోళనకు అనుమతి ఇవ్వొద్దని ప్రభుత్వం తరపు న్యాయవాది హైకోర్టును కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం పరిమితులకు లోబడి అనుమతులు ఇస్తామని తెలిపింది. ఆందోళనలో పాల్గొనే ఉద్యోగులు ఐడీ కార్డులు చూపాలని, , పరిమిత సంఖ్యను




సూచించింది. ర్యాలీలు నిర్వహించకుండా ఒక చోట కూర్చుని నిరసన తెలపాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, షెడ్యూల్ ప్రకారం శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా.. మరో తేదీని ప్రకటించాలని ధర్మాసనం ఉద్యోగ సంఘం నేతలకు సూచించింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.




జాబిల్లి ఉపరితలంపై దిగిన చంద్రయాన్-3 ప్రజ్ఞాన్ రోవర్ తన పరిశోధనల్లో నిమగ్నమైంది. ఈ 14 రోజుల కాలవ్యవధిలో చంద్రుడిపై రోవర్ పూర్తి చేయాల్సిన పరిశోధనల లిస్ట్ పెద్దగానే ఉంది. అందుకే.. జాబిల్లి ఉపరితలంపై అటూ ఇటూ తిరుగుతూ అన్వేషణలు సాగిస్తోంది. అయితే, బండరాళ్లు, బిలాలతో నిండిన చందమామపై తాను నడవాల్సిన సురక్షిత మార్గాన్ని కూడా సక్రమంగా ఎంచుకుంటోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను ఇస్రో తాజాగా ఎక్స్ (ట్విటర్)లో పంచుకుంది. "సురక్షితమైన మార్గాన్ని వెతుక్కుంటూ రోవర్ తిరుగుతోంది. ప్రజ్ఞాన్ భ్రమణాన్ని ల్యాండర్ ఇమేజర్ కెమెరా బంధించింది. తల్లి ఆప్యాయంగా చూస్తుంటే.. చందమామ పెరట్లో చిన్నారి సరదాగా ఆడుకుంటున్నట్లుగా ఉంది కదా ఈ వీడియో" అంటూ ఇస్రో సరదగా రాసుకొచ్చింది.

**జాబిల్లిపై సల్ఫర్ ఎలా? :** చంద్రుడి దక్షిణ ధ్రువానికి చేరువలోని ఉపరితలంపై మొట్టమొదటిసారిగా జరిపిన పరిశోధనల్లో సల్ఫర్ ఉనికిని రోవర్‌లోని కీలమైన లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (లిబ్స్) గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ప్రజ్ఞాన్‌లోని మరో పరికరం కూడా దీన్ని ధ్రువీకరించింది. మరో టెక్నిక్‌తో జాబిల్లి ఉపరితలంపై సల్ఫర్ ఉన్నట్లు గుర్తించింది. ఆల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోస్కోప్ దీన్ని ధ్రువీకరించినట్లు ఇస్రో తెలిపింది. "జాబిల్లి ఉపరితలంపై సల్ఫర్ ఎలా వచ్చింది..?అంతర్గతంగానే ఉందా?అగ్నిపర్వతం లేదా ఉల్కల వల్లనా? వంటి అంశాలను పరిశోధించేందుకు తాజా శాస్త్రవేత్తలు అధ్యయనం చేయాల్సి ఉంది" అని ఇస్రో తెలిపింది.

# సెప్టెంబర్‌లో పార్లమెంట్ ప్రత్యేక భేటీ.. ఎజెండాపై సస్పెన్స్!



దిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఐదు రోజులపాటు జరగనున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. జీ20 సదస్సు ముగిసిన తర్వాత జరిగే ఈ సమావేశాల అజెండా ఏంటనే విషయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సెప్టెంబర్ 18 నుంచి 22వరకు ఐదు రోజులపాటు జరగనున్నాయి. అమృత్ కాల్ వేళ ఈ పార్లమెంటు సమావేశాల్లో చర్చలు ఫలప్రదంగా జరగాలని ఆశిస్తున్నాం' అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ప్రస్తుత 17వ లోక్‌సభ.. 13వసారి సమావేశమవుతుండగా రాజ్యసభకు మాత్రం ఇది 261వ సమావేశం. ఈ ప్రత్యేక సమావేశాల అజెండా ఏంటన్న విషయంపై స్పష్టత లేనప్పటికీ.. పార్లమెంటు కొత్త భవనంలోకి మారేందుకే ఈ భేటీ అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశాలు పాత భవనంలో మొదలై.. కొత్త భవనంలో ముగుస్తాయని సమాచారం. వీటితోపాటు జీ20 సదస్సులో కీలక చర్చలు, జమ్మూకశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో ఈ ప్రత్యేక సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలపై సమీక్ష.. ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు



తిరుమల: అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని తితిదే ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. భక్తుల సౌకర్యం కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, తితిదేలోని అన్ని విభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈవో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు సాలకట్ల, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. సెప్టెంబరు 18న శ్రీవారికి సీఎం జగన్ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. ఉత్సవాల సందర్భంగా బ్రేక్ దర్శనాల సిఫారసు లేఖలు స్వీకరించం. స్వయంగా వచ్చే ప్రముఖులను మాత్రమే అనుమతిస్తాం.

అలాగే వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేశాం. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తాం. వీరికి ఉచిత రవాణా, భోజనం, బస కల్పిస్తాం. భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ రోజు ఘాట్ రోడ్‌లో ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేశాం. అటవీ శాఖ తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు నడక మార్గాల్లో ఇప్పుడున్న నిబంధనలు కొనసాగుతాయి" అని ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

# జగన్ రైతు వ్యతిరేకి : మాజీ మంత్రి కన్నా



పల్నాడు జిల్లా : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రైతులపై ప్రేమ లేదని.. జగన్ రైతు వ్యతిరేకిగా చరిత్రలో నిలిచిపోతారని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దస్తావేజు విలేకర్లుకు టీడీపీ మద్దతు ఉంటుందన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ విధానం సరైనది కాదని.. రాష్ట్రంలో దోపిడీ ప్రధానంగా జరుగుతోందన్నారు. ఆన్‌లైన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖపై సమీక్ష జరగడం లేదని చెప్పారు. సత్తెనపల్లి నియోజకవర్గ భయం గుప్పిట్లో ఉందన్నారు. టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసే పరిస్థితి దాపురించిదన్నారు.తొండపిలో హిందూ దేవాలయం నిర్మాణం జరగాలంటే వైసీపీ కండువా కప్పు కోవాలని బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంబటి రాంబాబు పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవటం సరైనది కాదని కన్నా లక్ష్మీనారాయణ హితవు పలికారు.

# ఇసుక, మట్టిమాఫియాలపై ఉక్కుపాదం

ఏలూరు: తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇసుక, మట్టిమాఫియాలపై ఉక్కుపాదం మోపుతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హెచ్చరించారు. గురువారం నాడు కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. 10 గ్రామాలను కలిపే సరిపల్లి రోడ్డు, కేతవరం రోడ్డు అధ్వానంగా ఉన్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోనే ఇసుకమాఫియా పేట్రేగిపోతోందన్నారు. జగన్, ఆయన సామంతరాజులు ఇప్పటివరకు రూ. 40వేల కోట్లరూపాయల ఇసుకను దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే మెరుగైన పాలసీ ద్వారా ఇసుకను ప్రజలకు అందుబాటులోకి



తెస్తామని స్పష్టంచేశారు. గ్రామీణ, పట్టణప్రాంతాలనే తేడా లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందజేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పాడైపోయిన రోడ్లన్నింటినీ పునర్నిర్మిస్తామని నారా లోకేష్ తెలిపారు.

## సోఫాలో రసగుల్ల ఇలా కోలుకుందో లేదో కానీ..!

యాక్సిడెంట్ లో చేయి విరగ్గొట్టుకుని నభానటేష్ తీవ్రంగా ఇబ్బందికి గురైన సంగతి తెలిసిందే. ప్రమాదంలో శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. అయితే ఎముకలు విరిగాక నొప్పి భరించలేనంతగా ఉందని నభా బాధను వ్యక్తం చేసింది. దీనికి శస్త్ర చికిత్స జరిగింది. కొంతకాలం పాటు పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వస్తున్నందుకు చాలా ఆవేదనగా ఉన్నానని నభా తెలిపింది. అయితే ఎట్టకేలకు అన్ని గాయాల నుంచి కోలుకుని తిరిగి యాక్టివ్ అయినట్టే కనిపిస్తోంది. నెమ్మదిగా కోలుకుని తిరిగి తనదైన ఎనర్జీని పుంజుకుంటోంది ఈ ఇస్మార్ట్ భామ. ఇంతలోనే తనదైన శైలిలో



అద్భుతమైన ఫోటోషూట్ తో నభా నటేష్ వెబ్ లోకి దూసుకొచ్చింది. చినుగుల డెనిమ్ ఫ్యాంట్ .. కాంబినేషన్ గా చారల చొక్కాలో నభా సరికొత్తగా కనిపించింది. ఇక బటన్ లెస్ షర్ట్ లో నభా అందాల హిందోళం యూత్ లో కిక్కు పెంచింది. టూమచ్ గా చినిగిన బ్లూ జీన్స్ నభా పోష్ లుక్ ని ఎలివేట్ చేస్తోంది. చేతిలో కప్పు కాఫీతో అలా కురులను సరి చేసుకుంటూ కనిపించింది. వాస్తవానికి ముందు మీ కాఫీని తాగండి..!! అంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది.

నభా నటేష్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ విజయంలో నభా కీరోల్ గురించి తెలిసినదే. రామ్ పెర్ఫామెన్స్ కి ధీటుగా మాస్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేసింది. కోస్టార్ నిధి కంటే నభాకి ఎక్కువ మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఈ బ్యూటీ డిస్కోరాజా, అల్లుడు అదుర్స్, మాస్ట్రో, చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది.

అన్ని పెద్ద ప్రాజెక్ట్ లే. కానీ వైఫల్యాలు ఎదురయ్యాయి. ఇక ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఈ బ్యూటీ పారితోషికం భారీగా పెంచేసిందని గుసగుసలు వినిపించాయి. నభా తదుపరి సినిమాల గురించి అప్ డేట్ తెలియాల్సి ఉంది.

## అవమానం జరిగిన చోటే గౌరవం దక్కించుకున్న శోభిత

గూఢచారి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ శోభిత దూళిపాళ్ల. ఈ అమ్మడు బాలీవుడ్ లో అంతకు ముందు సినిమాలు చేయడంతో చాలా శాతం మంది ఈమె నార్త్ ఇండియన్ అనుకున్నారు. కానీ శోభిత తెలుగు అమ్మాయి. మోడలింగ్ పై ఆసక్తితో చిన్న వయసులోనే ప్రయత్నాలు మొదలు పెట్టిందట. ప్రస్తుతం సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా పలు సినిమాల్లో నటిస్తున్న ముద్దుగుమ్మ శోభిత ధూళిపాళ్ల వరుసగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నాకు 20 ఏళ్ల వయసు ఉన్న సమయంలోనే మోడలింగ్ చేయాలనుకున్నారు. అప్పుడు ఒక



షాంపూ కంపెనీ యొక్క వాణిజ్య ప్రకటన లో నటించేందుకు వెళ్లాను. ఆ సమయంలో కంపెనీ వారు నన్ను కనీసం బ్యాక్ గ్రౌండ్ లో కనిపించే మోడల్ గా కూడా పనికి రావు అంటూ అవమానించారు. ఆ సమయంలో శోభిత మౌనంగా అక్కడ నుండి వచ్చేసిందట. కానీ కొన్నాళ్ల తర్వాత అదే సంస్థ యొక్క బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. శోభిత ఈ మధ్య కాలంలో మోడల్ గా మరియు హీరోయిన్ గా బిజీ బిజీగా ఉంది. ఈ సమయంలోనే అక్కినేని హీరో నాగ చైతన్య తో ప్రేమలో ఉందనే పుకార్లతో వార్తల్లో నిలిచింది. ఆ విషయం వాస్తవం కాదని పలు సార్లు శోభిత పేర్కొంది. అయినా కూడా పుకార్లు ఆగడం లేదు.




## స్టైలిష్ ఆటిట్యూడ్ తో నిలబడి వలపుల బాణాలు!



మెంటల్ మదిలో మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన తమిళ్ భామ నివేతా పెతురాజ్. మొదటిచిత్రంతోనే నటిగా మార్కులు కొట్టేసిన ఈ అమ్మడు రెండో సినిమాని కూడా శ్రీవిష్ణుతోనే చేసింది. అయితే తెలుగు కంటే ముందుగానే మాతృభాష తమిళంలో హీరోయిన్ గా సక్సెస్ అయ్యింది. చిత్రలహరి మూవీతో తేజ్ కి జోడీగా నటించి సక్సెస్ అందుకుంది. త్రివిక్రమ్ అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన అల వైకుంఠపురంలో మూవీలో సెకండ్ హీరోయిన్ గా నివేతా నటించింది. అయితే ఆ మూవీ ఆశించిన స్థాయి గుర్తింపు అయితే ఈ బ్యూటీకి ఇవ్వలేదు. ఈ ఏడాది విశ్వక్ సేన్ కి జోడీగా దాస్ కా దమ్కీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకుంది. సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నివేతా కనిపించడం విశేషం. ప్రస్తుతం తమిళంలో పార్టీ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించడానికి ఈ అమ్మడు సిద్ధం అవుతోంది. చేసిన సినిమాలు తక్కువే అయిన నివేతా కెరియర్ లో సక్సెస్ లు ఎక్కువని చెప్పొచ్చు. తెలుగులో ఆమె నటించిన సినిమాలన్నీ హిట్ టాక్ తెచ్చుకున్నవే. ఇక ఈ అమ్మడు మరీ శృతి మించి అందాల ప్రదర్శన చేయకపోయిన టెంప్టింగ్ షేపులతో కట్టిపడేస్తూ ఉంటుంది. అందుకే సోషల్ మీడియాలో నివేతా పేతురాజ్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ ఫోటోలని ఈ బ్యూటీ పంచుకుంటూ ఉంటారు. వాటికి లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి అదిరిపోయే సోకులని టెంప్ట్ చేసే ఫోజులతో చూపిస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తోంది. వైట్ కలర్ నైట్ డ్రెస్ వేసి షర్ట్ బటన్స్ తీసేసి ఎద అందాలని సెల్ఫీ ఫోజులతో చూపిస్తోంది. అలాగే స్టైలిష్ ఆటిట్యూడ్ తో నిలబడి వలపుల బాణాలు విరుసుతోంది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. నివేతా షేర్ చేసిన ఈ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో ఏకంగా 3.71 లక్షలకి పైగా లైక్ చేయడం విశేషం.

## అమ్మడి వర్కౌట్స్ చూపరులకు చెమటలు



సోషల్ మీడియాలో ముద్దుగుమ్మలు హాట్ ఫొటో షూట్స్ ను షేర్ చేయడం చాలా కామన్ విషయం. అయితే కొందరి ఫొటోలు అందంగా ఉంటే మరికొందరి ఫోటోలు మాత్రం బోల్డ్ గా ఉంటాయి. ఎంతగా స్కిన్ షో చేసినా కూడా కొందరి ఫొటోలు బోల్డ్ గా కాకుండా గ్లామర్ గా అందంగా హాట్ గా ఉన్నాయి అనిపిస్తుంది. సోషల్ మీడియాలో ముద్దుగుమ్మలు పోటీ పడి మరీ తమ హాట్ ఫొటో షూట్స్ షేర్ చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఆ ఫొటో షూట్స్ కాకుండా వర్కౌట్ చేస్తున్నప్పుడు తీసుకున్న ఫొటోలు.. వర్కౌట్ పూర్తి అయిన తర్వాత చెమటతో ఉన్న ఫొటోలను షేర్ చేస్తూ ఉన్నారు. తాజాగా బాలీవుడ్ హాట్ బ్యూటీ ఐషా శర్మ షేర్ చేసిన ఫొటోలు చలికాలంలో కూడా చమటలు పట్టించేలా ఉన్నాయి. ఆమె క్లీవేజ్ షో తో పాటు ఆమె ఒంపు సొంపులు చూడగానే వావ్ అనిపించేలా ఉన్నాయి. కొందరి వర్కౌట్ స్టిల్స్ ఎబ్బెట్టుగా అనిపిస్తాయి. కాని ఐషా శర్మ గ్లామర్ షో మాత్రం వావ్ అనిపించేలా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఉదయం ఎండలో వర్కౌట్స్ చేస్తే మంచి ఫిజిక్ తో పాటు ఇలా అందంగా కూడా అవ్వచ్చా అంటూ ఈ అమ్మడి ఫొటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట ఈ ఫొటోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఈమె గురించి తెలుసుకునేందుకు కొందరు ఆసక్తి చూపిస్తున్నారు. ఐషా శర్మ విషయానికి వస్తే.. తెలుగు తో పాటు బాలీవుడ్ లో హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ నేహా శర్మ సోదరి ఐషా శర్మ. బాలీవుడ్ లో ఇప్పుడిప్పుడే ఈమె సినిమాల్లో నటించడం మొదలు పెట్టింది. కెరీర్ ఆరంభించిన వెంటనే కరోనా వల్ల ఆఫర్లు పెద్దగా రావడం లేదు. మళ్లీ పరిస్థితులు చక్కబడితే ఖచ్చితంగా ఈఅమ్మడు బిజీ అవ్వడం ఖాయం అన్నట్లుగా అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇంతటి అందంను ఖచ్చితంగా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ వదులుకోరు అనేది సోషల్ మీడియా టాక్.

## పుష్పరాజ్ ని శ్రీదేవి తనయ అలా అనేసిందేమిటీ?

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా..ఫైర్! అన్న డైలాగ్ థియేటర్లో ఎలా పేలింతో చెప్పాల్సిన పనిలేదు. టైటిల్ కి పర్ ఫెక్ట్ జస్ట్ ఫికేషన్ అది. తగ్గేదేలే!! అన్న డైలాగ్ తోనే పుష్ప రాజ్ పాత్రని సుకుమార్ ఎంత పవర్ ఫుల్ గా డిజైన్ చేసారో అర్ధమవుతుంది. పుష్పరాజ్ యాటిట్యూడ్ ప్రవర్తనా విధానం ఎలాంటిదో ఆ డైలాగ్ తోనే ముగింపు వరకూ వినిపిస్తూనే ఉంటుంది. సినిమాకి రివ్యూల పరంగా ప్రతికూలంగా అనిపించినా బాక్సాఫీస్ వద్ద మాత్రం వసూళ్ల సునామీనే సృష్టించింది. ఉత్తరాదిన రిలీజ్ అయిన రెండు రోజుల పాటు జనాలు థియేటర్ వైపు చూసింది లేదు గానీ..అటుపై వచ్చిన మౌత్ టాక్ తో ఒక్కసారిగా సినిమా అలా పైకి లేచింది. ఇప్పుడు ఓటీటీలోకి కూడా అందుబాటులోకి రావడంతో పుష్ప రాజ్ కి బాలీవుడ్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఇప్పటికే ఈ చిత్రాన్ని వీక్షించి బన్నీపైనా కంటెంట్ పైనా ప్రశంసలు కురిపించారు. తాజాగా అతిలోక సుందరి శ్రీదేవి స్వీట్ డాటర్ జాన్వీ కపూర్ కూడా పుష్పని పొగడ్తలతో ముంచెత్తకుండా ఉండలేకపోయింది. అందరికన్నా పుష్ప రాజ్ కి ది బెస్ట్ కాంప్లిమెంట్



ఇచ్చేసింది. ఇన్ స్టా వేదికగా జాన్వీ తన అభిప్రాయాన్ని తెలిపింది. పుష్ప మాస్ గెటప్ ని షేర్ చేస్తూ.. ది కూలెస్ట్ మేన్ ఇన్ ది వరల్డ్ అని క్యాప్షన్ ఇచ్చింది. మైండ్ బ్లోయింగ్ అని కూడా రాసికొచ్చింది. ఈ పోస్ట్ ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఐకాన్ స్టార్ ని ఉద్దేశించి ఇప్పటివరకూ ఏ హీరోయిన్ ఈ రేంజ్ లో కామెంట్ చేసింది లేదు. మరి కూలెస్ట్ మ్యాన్ అని పుష్పరాజ్ పాత్రలో కోణాన్ని ఉద్దేశించి ఇలా కామెంట్ చేసింది. పుష్పరాజ్ ఇందులో బీడి తాగుతూ కూల్ గా ఉంటాడు. తను ఎవరి జోలికి పోడు..ఎవరైనా తన జోలికి వస్తే ఊరుకోని నైజం. గంధపు దుంగల వ్యాపారంలోకి దిగిన తర్వాత టెన్షన్లు ఉంటాయి. పుష్పరాజ్ అంతకుముందు వరకూ జాన్వీ చెప్పినట్లు కూల్ గయ్ నే కదా. తెలివిగా స్కెచ్ లు వేస్తూ రాజకీయం నడిపించేవాడిగానూ పుష్ప లో యాంగిల్ ఆకట్టుకుంటుంది. ఎర్రచందనం మాఫియా కు డాన్ అయ్యాడంటే.. శ్రీవల్లితో పబ్లిగ్గానే రొమాన్స్ చేశాడంటే.. ఆషామాషీ వ్యవహారమా? అందుకే కూల్ మ్యాన్ అంటూ పుష్పరాజ్ ని జాన్వీ పొగిడేసిందన్నమాట. ఇకపోతే తెలుగులో నటిస్తే విజయ్ దేవరకొండతో పాటు అల్లు అర్జున్ సరసన కూడా అవకాశం వస్తే మిస్ చేసుకోదనడానికి ఇది సింబాలిక్ అని భావించాల్సి ఉంటుంది. బన్ని సరసన జాన్వీ అంటూ ఇంతకుముందు కథనాలు కూడా వైరల్ అయిన సంగతి విధితమే.

## శ్రుతి-శంతను! ఎవరు ముందు ప్రపోజ్ చేశారు?

శ్రుతి హాసన్ ముంబైకి చెందిన ఆర్టిస్ట్ శంతను హజారికాతో రిలేషన్ లో ఉన్న సంగతి తెలిసిందే. గత రెండేళ్లుగా ఈ అభినవ జంట పీకల్లోతూ ప్రేమలో మునిగితేలుతున్నారు. ప్రస్తుతం ముంబైలోనే కలిసి ఉంటున్నారు. రిలేషన్ కి సంబంధించిన అప్ డేట్స్ ని సైతం శ్రుతి హాసన్ ఎప్పటకప్పుడు ఇన్ స్టా వేదికగా చెబుతుంటుంది. తాజాగా ఈ జంట ఇన్ స్టా గ్రామ్ లో అభిమానులతో చిట్ చాట్ లో పాల్గొంది. ఈ క్రమంలో ఇద్దరిలో ఎవరు ముందుగా ప్రపోజ్ చేసారు? అన్న ప్రశ్న ఎదురైంది. దీనికి శ్రుతి హాసన్ నే ముందుగా శంతన్ కి నేనే ప్రపోజ్ చేశానని తెలిపింది. ఐలవ్ యూఅని చెప్పి తన మనసులో ఉన్న ప్రేమను శంతనుతో పంచుకుందిట. అయితే మొదటి నుంచి శ్రుతి హాసన్ అంటే ఇష్టం అన్న భావనలో శాంతను ఉన్నాడట. ఆ ధైర్యంతోనే శ్రుతి హాసన్ మరో ఆలోచన లేకుండా ప్రేమను ఓపెన్ గా చెప్పేసినట్లు రివీల్ చేసింది. మొత్తానికి ఈ జంట ప్రేమాయణం ప్రస్తుతానికి సజావుగానే సాగుతోంది. ఈ బ్యూటీ ప్రేమలో పడటం



ఇదే మొదటిసారి కాదు. ఇటాలియన్ నటుడు మైకేల్ కోర్సలేతో శ్రుతి హాసన్ డీప్ లవ్ ని సాగించింది. కమల్ హాసన్ కి కూడా మైఖెల్ ని పరిచయం చేసింది. పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం సాగింది. కానీ ఏం జరిగిందో ఏమో! ఒక్కసారిగా ఇద్దరికీ బ్రేకప్ జరిగింది. అలాగే ఓ కోలీవుడ్ నటుడు..టాలీవుడ్ నుటుడితోనూ శ్రుతి హాసన్ ప్రేమలో పడినట్లు మీడియాలో ప్రచారం సాగింది. కానీ వాటికి సంబంధించి బలమైన ఆధారాలు అయితే లేవు. మైఖేల్ కోర్సలే తర్వాత శంతనుతో లవ్ ని పబ్లిక్ చేసింది శ్రుతీ. శ్రుతి హాసన్ సినిమాల విషయానికి వస్తే పాన్ ఇండియా చిత్రం సలార్ ప్రభాస్ సరసన నటిస్తోంది. ఇందులో శ్రుతి యాక్షన్ క్వీన్ గా కనిపిస్తుందని సమాచారం. అలాగే ఇటీవలే బాలకృష్ణ సరసన ఓ చిత్రానికి సంతకం చేసింది. మెగాస్టార్ చిరంజీవి-బాబి ప్రాజెక్ట్ లోనూ హీరోయిన్ గా ఛాన్స్ అందుకుంటోందని కథనాలొచ్చాయి.








## ప్రగతి భవన్‌లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు.. సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టిన తోబుట్టువులు

హైదరాబాద్ : ప్రగతి భవన్‌లో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. తోబుట్టువుల ప్రేమానురాగాలు, అనుబంధాలకు వేదికగా ప్రగతి భవన్ నిలిచింది. రాఖీ పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఆయన తోబుట్టువులు రాఖీలు కట్టారు. అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ, లలితమ్మ, చెల్లెలు వినోదమ్మ కలిసి కేసీఆర్‌కు రాఖీ కట్టి ఆశీర్వదించారు. అనంతరం తోబుట్టువులకు కేసీఆర్ పాదాభివంద నాలు చేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి శోభమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మలోని మొదటి అక్షరం.. నాన్నలోని చివరి అక్షరం నా 'అన్న'.. ఎమ్మెల్సీ కవిత ట్వీట్



రాఖీ పండుగ అంటేనే అనుబంధాలకు ప్రతీక. తమ సోదరులకు తోబుట్టువులు రాఖీ కట్టి.. ఈ అనుబంధం కలకాలం కొనసాగాలని కోరుకుంటారు. ఒకరికొకరు ఆశీర్వాదం తీసుకుంటారు. అంతటి ప్రత్యేకమైన రాఖీ పండుగ రోజు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎమోషనల్ ట్వీట్ చేశారు. అమ్మలోని మొదటి అక్షరం 'అ', నాన్నలోని చివరి అక్షరం 'న్న' కలిపితే నా 'అన్న' అంటూ మంత్రి కేటీఆర్‌తో ఉన్న ఫొటోను ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. ఇక మంత్రి కేటీఆర్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. రాఖీ పండుగ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌కు ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టారు. సోదరి సౌమ్య జోగినిపల్లితో లిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ ట్విట్టర్ వేదికగా ఫొటోలను షేర్ చేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని పేర్కొన్నారు.

## ఎన్నికల వేళ పొలిటికల్ టూరిస్టులు వస్తుంటారు.. ప్రతిపక్షాలపై హరీష్‌రావు ఎద్దేవా



హైదరాబాద్: నకిలీ హామీలు, వెకిలి చేష్టలు చేయడమే ప్రతిపక్షాలు పని అంటూ మంత్రి హరీష్‌రావు విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కన్నా మెరుగైన పాలన ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పొలిటికల్ టూరిస్టులు వస్తుంటారంటూ ఎద్దేవా చేశారు. మొన్న అమిత్ షా, నిన్న ఖర్గే వచ్చి పేపర్ పై రాసిచ్చిన హామీలు చదివి వెళ్లారన్నారు. వారికి రాష్ట్రం పైన ఎలాంటి అవగాహన లేదని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి విషయంలో మాటలు కాకుండా చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైద్యారోగ్య రంగంలో దేశంలోనే 3 వ స్థానంలో ఉన్నామన్నారు. తలసరి ఆదాయంలో భారతదేశంలో నెంబర్ వన్‌గా ఉన్నది తెలంగాణ ప్రభుత్వమని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రనికే కాదు దేశానికే అన్నం పెట్టె స్థాయికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ వస్తుందని... హ్యాట్రిక్ కొట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

మూడవ సారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రానున్నారని తెలిపారు. బీఆర్ఎస్ స్లోగన్‌లు చేసే పార్టీ కాదు... సొల్యూషన్ ఇచ్చే పార్టీ అని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 2 నుంచి టీచర్ల బదిలీలు నేడుషెడ్యూల్ విడుదల

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 2 నుంచి టీచర్ల బదిలీలు చేపట్టనుంది. ఈ మేరకు రేపు తెలంగాణ విద్యాశాఖ రేపు (శుక్రవారం) షెడ్యూల్ విడుదల చేయనుంది. టీచర్ల బదిలీలకు బుధవారం హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. అందుకోసం ప్రభుత్వం ఇప్పుడు కసరత్తు చేస్తున్నది. ఈ బదిలీల్లో ఉపాధ్యాయ దంపతులకు అదనపు పాయింట్లు కేటాయించనుంది. కాగా, తుది తీర్పునకు లోబడే టీచర్ల బదిలీలు జరగాలని హైకోర్టు ఆదేశించింది. కాబట్టి హైకోర్టు ఆదేశానుసారమే టీచర్ల బదిలీల ప్రక్రియ జరగనుంది. వాస్తవానికి, విద్యాశాఖ టీచర్ల బదిలీల షెడ్యూల్‌ను జనవరిలో విడుదల చేసింది. ఫిబ్రవరిలోనే బదిలీలు చేపట్టాల్సి ఉన్నది. 59 వేల మందికిపైగా టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకొన్నారు. ఈ దశలో హైకోర్టు స్టే జారీచేయడంతో బదిలీలు నిలిచిపోయాయి. తాజాగా స్టే ఎత్తివేయడంతో బదిలీలు, పదోన్నతులకు పచ్చజెండా ఊపినట్టయింది.



గతంలో బదిలీలకు కటాఫ్ తేదీని ఫిబ్రవరి 1గా ఖరారు చేశారు. తాజాగా ఈ గడువును సెప్టెంబర్ 1గా నిర్ణయించారు. దీంతో జూలై 2015 తర్వాత వారు కూడా తప్పనిసరిగా బదిలీ అవుతారు.

## ఖర్గే గురించి మాట్లాడే అర్హత హరీష్‌కు లేదు



హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురించి మాట్లాడే అర్హత మంత్రి హరీష్‌రావుకు లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం నాడు ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "ఖర్గే చరిత్ర ఏంటో హరీష్ రావు తెలుసుకుంటే మంచిది. ఖర్గే దళితవర్గంలో పుట్టి ఏఐసీసీ అధ్యక్షుడు అయ్యాడు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మా నిబద్ధత. గత 9 ఏళ్లుగా దళితులను మోసం చేస్తూనే ఉన్నారు.రాష్ట్ర సంపదను కల్వకుంట్ల కుటుంబం కొల్లగొట్టింది.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు డిపాజిట్లు రావు. సెప్టెంబర్ 2వ తేదీన షాద్ నగర్‌లో బీసీ డిక్లరేషన్ సభ ఉంటుంది" అని మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు.

## అభివృద్ధిని మెచ్చే బీఆర్ఎస్‌లో చేరుతున్నారు : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున చేరుతున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లాలోని హన్వాడ మండలం చిందార్ పల్లీ, చిర్మల్ కుచ్చా తాండా లకు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్, బీజేపీ పార్టీ లకు చెందిన ముఖ్య కార్యకర్తలు మంత్రి సమక్షంలో మహబూబ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఇతర రాష్ట్రాల కు ఆదర్శంగా నిలిచిందన్నారు. 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు బంధు, రైతు బీమాను అందించి అన్నదాతలకు అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. గతంలో మహబూబ్‌నగర్ ఎలా ఉంది. ఇప్పుడు ఎలా అభివృద్ధి సాధించింది అనే విషయాన్ని గమనించాలన్నారు.

జిల్లాకు ఎన్నో కంపెనీలు వస్తున్నాయని, ఇక్కడే స్థానికంగా వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ

ఢిల్లీ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని కలిశారు. గురువారం ఉదయం సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో ఆమె బ్రేక్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంలోనే రాజకీయపరమైన చర్చ జరిగినట్లు స్పష్టమవుతోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీని కలిశాను. చాలా నిర్మాణాత్మక చర్చలు జరిగాయి.

తెలంగాణ ప్రజలకు మేలు చేసే దిశగా నిరంతరం పనిచేస్తా. కేసీఆర్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యింది అని భేటీ అనంతరం బయటకు వచ్చిన ఆమె మీడియాతో తెలిపారు. ఈ సమావేశంలో సోనియా, రాహుల్‌తో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. షర్మిల వెంట ఆమె భర్త అనిల్ కూడా ఉన్నారు. కాంగ్రెస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనం గురించి గత కొంతకాలంగా చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ఇంతకుముందు ఆమె పలువురు కాంగ్రెస్ నేతలను కలవడంతో పాటు హస్తిన వెళ్లి పెద్దల్ని కలిసి వచ్చారు. ఆ మధ్య ఢిల్లీ నుంచి తిరిగి వస్తూ.. కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డితో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఆమె కనిపించారు.

ఆ టైంలో షర్మిలను కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు కూడా. అయితే విలీన ప్రస్తావనపై షర్మిల మాత్రం పెదవి విప్పలేదు. అయితే తాజా చర్చలతో ఆ ప్రక్రియలో ముందడుగు పడినట్లయ్యింది.




## సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దీప్తి అనుమానాస్పద మృతిపై వీడని మిస్టరీ.. ట్విస్ట్ ఏంటంటే..

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దీప్తి అనుమానాస్పద మృతి మిస్టరీ కొనసాగుతోంది. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతానికి చెందిన బంక శ్రీనివాస్ ఇటుక బట్టి వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు బంకి దీప్తి బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రం హెూమ్ చేస్తోంది. చిన్న కూతురు చందన బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం శ్రీనివాస్ దంపతులు హైదరాబాదులో శుభ కార్యక్రమానికి వెళ్లగా అక్కాచెల్లెలు ఇద్దరే ఇంట్లో ఉన్నారు. శ్రీనివాస్ మంగళవారం ఉదయం నుంచికూతుర్లకు ఫోన్ చేసినప్పటికీ దీప్తి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పాటు చందన ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఇంటి పక్కవారికి శ్రీనివాస్ ఫోన్ చేసి తన ఇంటికి వెళ్లి చూడమన్నాడు. దీంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా దీప్తి ముందు రూంలోని సోఫాలో పడి ఉండటాన్ని గమనించి తండ్రి శ్రీనివాస్‌తో పాటు పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో తనిఖీలు నిర్వహించారు. వంట గదిలో ఉన్న మద్యం సీసాను సీజ్ చేసి మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం బాటిల్ లేబుల్ ఆధారంగా వైన్స్ సీసీ ఫుటేలను సేకరించారు. బుధవారం ఉదయం చందన తన ఫోన్ నుంచి తండ్రి శ్రీనివాస్‌కు, తమ్ముడికి వాయిస్ మెసేజ్ పెట్టింది.. 'నేను, అక్క ఇద్దరం కలిసి మందు తాగాము. నేను ఇంట్లో నుంచి వెళ్లిపోదాం అనుకున్నా.. కానీ అక్కకు చెప్పి పోదాం అనుకున్నా.. కాని అక్క అప్పటికే మందు తాగి సోఫాలో పడుకుంది. రెండు సార్లు లేపినా లేవలేదు.. చాన్స్ దొరికింది కదా అని నేను ఇంట్లో నుంచి వెళ్లిపోయిన.. అంతే కానీ నేను అక్కను ఎందుకు చంపుతాను' అంటూ ఆ ఆడియోలో ఉంది. కానీ మెసేజ్ వచ్చిన కొద్ది సేపటికే ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు చందన ఫోన్‌ను ట్రేస్ చేసి హైదరాబాదులో ఉన్నట్టు గుర్తించి విచారణ బృందం అక్కడకు చేరుకుంది. కానీ అప్పటికే చందన అక్కడి నుంచి వెళ్లిపోయిందని సమాచారం. చిన్న కూతురు చందన అదృశ్యం కావడం.. పెద్ద కూతురు దీప్తి మృతి చెందడంతో తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యా దు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. కాగా ఇంట్లోని బంగారు ఆభరణాలు, భారీ మొత్తంలో నగదు పోయిందని శ్రీనివాస్ పోలీసులకు తెలిపాడు. దాదాపు 30 తులాల బంగారం, 2 లక్షల డబ్బు పోయినట్లు సమాచారం.

కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మృతురాలు దీప్తి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సోదరి చందన ఆచూకీ కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

## జనగామలో ఆసక్తిగా మారిన రాఖీ పాలిటిక్స్

జనగామ: జనగామలో రాఖీ పాలిటిక్స్ ఆసక్తికరంగా మారాయి. జనగామ ప్రధాన కూడళ్లలో రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలుపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీలు వెలిశాయి. మరో వైపు పల్లాకు రాఖీ కట్టేందుకు హైదరాబాద్‌లోని పల్లా నివాసం దగ్గర జనగామ నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు క్యూ కట్టారు. స్వయంగా మహిళలకు టిఫిన్ వడ్డించి, భారీ స్థాయిలో గిఫ్టులు ఇచ్చి పంపించారు. జనగామ నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. జనగామ టికెట్‌ను బీఆర్ఎస్ అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. ఈ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టారు.

ఈ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డే ఆశిస్తున్నారు. తనకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ పెద్దలను కలిసి విన్నవించారు. ఇంకోవైపు ఈసారి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా




జనగామ టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జనగామ టికెట్‌ను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. మరీ ఈ టికెట్‌ను ఎవరికి కేటాయిస్తారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.



## సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్: మంత్రి తలసాని

రెజిమెంటల్ బజార్: సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా గురువారం వెస్ట్ మారెడ్ పల్లి లోని తన నివాసానికి మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి మంత్రి చేతికి రాఖీలు కట్టారు. అమీర్ పేట మాజీ కార్పొరేటర్ తో పాటు బన్సీలాల్ పేట, అమీర్ పేట, సనత్ నగర్, బేగంపేట, మొండా మార్కెట్ తదితర ప్రాంతాల నుండి వచ్చిన మహిళలు, ముస్లీం మహిళలు కూడా మంత్రికి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో కూడా మంత్రికి రాఖీలు కట్టారు.

## చెన్నమనేని రాజేశ్వర్ రావు గొప్ప నాయకుడు..

### శత జయంతి వేడుకల్లో మంత్రి కొప్పుల

వేములవాడ: దివంగత చెన్నమనేని రాజేశ్వర్ రావు జీవితాంతం ప్రజల కోసం పోరాడారని, ఆయన గొప్ప నాయకుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, మేధావిగా జాతీయ స్థాయిలో ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వేములవాడ పట్టణంలోని సంగీతా నిలయంలో దివంగత రాజేశ్వరరావు శతజయంతి వేడుకలకు హాజరై మంత్రి ఘన నివాళులర్పించారు. ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. రాజేశ్వర్‌రావు పోరాటాలు ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని నింపాయని చెప్పారు. వారి జ్ఞాపకాలు రాష్ట్ర చరిత్ర ఉన్నంత వరకు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత సామాజిక వర్గంలో జన్మించినా బడుగు బలహీన వర్గాల కోసం రాజేశ్వర్‌రావు పోరాడారని చెప్పారు. ప్రజల కోసం ఆయన జైలు జీవితం గడిపారని తెలిపారు. చెన్నమనేని కుటుంబం చాలా గొప్పదని, చెన్నమనేని రాజేశ్వరరావు, విద్యాసాగర్ రావు, హనుమంతరావు లాంటి నాయకులు గొప్ప సేవలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రంగాల ప్రభుత్వ ప్రధాన సలహాదారు, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com